Follow: @ANNTELUGU

ANN తెలుగు

09-06-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 187 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏడాది చివరిలో కొత్త ఎయిర్ పోర్టులకు టెండర్లు

2027 నాటికల్లా అందుబాటులోకి...

పర్యాటక రంగానికి మరింత ఊపు

వివరాలు 5లో

టాప్ న్యూస్

## చెవులున్నా వినపడవు


- నోరుంది కానీ చెప్పరు
- కిషన్ రెడ్డి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజా సింగ్ పరోక్ష విమర్శలు



05

## నేడు కమిషన్ ముందుకు హరీష్ రావు


- కాళేశ్వరంపై విచారణ
- విచారణపై సర్వత్రా ఉత్కంఠ




05

## అక్కినేని ఇంట పెళ్ళి సందడి

- అఖిల్ జైనాబ్ పెళ్లి రిసెప్షన్ కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- వధూవరులను ఆశీర్వదించిన మహేశ్ బాబు, సూర్య
- పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖుల రాక



08



## జూబ్లిహిల్స్‌కు బైపోల్

- బీహార్ ఎన్నికలతో కలిసి షెడ్యూల్
- సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో ఎలక్షన్
- బైపోల్ పై కాంగ్రెస్ గురి
- ఏడాదిన్నరలో ఇద్దరు ఎమ్మెల్యేలను కోల్పోయిన బీఆర్ఎస్

వివరాలు 5లో



## ఖమ్మం- పెద్దపల్లి ఎక్స్ ప్రెస్

- రెండు పార్లమెంట్ లకే ఆరు పదవులు
- కేబినెట్ లో హవా
- అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్

వివరాలు 5లో



చారిత్రక కాచిగూడ రైల్వేస్టేషన్ కు

## లైటింగ్ సొబగులు

- ఈనెల 9న ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- రూ. 2.23 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ

వివరాలు 5లో

# దళితులకు పెద్దపీట

## కొలువుదీరిన కొత్త కేబినెట్

### చరిత్ర సృష్టించిన కాంగ్రెస్

కేబినెట్‌లోకి వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, శ్రీహరి

డిప్యూటీస్పీకర్ గా రామచంద్రునాయక్.. రాజ్ భవన్ లో నిరాడంబరంగా ప్రమాణస్వీకారం

కేబినెట్ లో 25శాతం దళిత మంత్రులే.. చరిత్రలో ఫస్ట్ టైం

కాంగ్రెస్ నుండి.. గెలిచింది ఏడుగురు బిసిలే.. అందులో ముగ్గురికి కేబినెట్ ఛాన్స్

కాంగ్రెస్ హైకమాండ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ కు నూతన మంత్రుల ధన్యవాదాలు

సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ ఇంటికి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్

"తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. - మహా, హైదరాబాద్



02

## వివేక్ వెంకటస్వామి అనే నేను..

గడ్డం వివేక్‌కు ఎట్టకేలకు మంత్రి పదవి

- 16 ఏళ్ల రాజకీయ చరిత్రలో తొలిసారి అమాత్యయోగం
- నాడు వైఎస్సార్ కేబినెట్ లో వినోద్.. నేడు రేవంత్ కేబినెట్ లో వివేక్
- గడ్డం బ్రదర్స్ కు కలిసొచ్చిన కాంగ్రెస్

02





## సర్పంచ్ టూ మినిస్టర్

పాలిటిక్స్‌లో తిరుగులేని వాకిటి శ్రీహరి

ఫస్ట్ టైం ఎమ్మెల్యే.. మినిస్టర్ ఛాన్స్

రాష్ట్రంలో.. రెండో ముదిరాజ్ మంత్రి

ఏపని చేపట్టినా విజయమే

వివరాలు 2లో

## అడ్లూరి లక్ష్మణ్ అనే నేను..

అలుపెరుగని అడ్లూరి

'అడ్లూరి' ని వరించిన అమాత్య పదవి

పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి పలువురికి ఆదర్శంగా నిలిచిన నేత

పేద నేతకు.. వెతుక్కుంటూ వచ్చిన పదవి



02

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత

### కన్నీళ్ళు పెట్టుకున్న కేసీఆర్

- నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- కేటీఆర్, హరీష్ సహా కీలక నేతల దిగ్భ్రాంతి
- హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు.. సంచలనాలకు మారుపేరు

**హైదరాబాద్, మహా:** కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాగంటి గోపీనాథ్ (62) ఆదివారం ఉదయం 5.45 గంటలకు గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో తుదిశ్వాస విడిచారు. ఈనెల 5న తీవ్రమైన ఛాతీనొప్పితో బాధపడిన గోపీనాథ్‌ను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానకు తరలించారు. అప్పటి నుంచి హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ అరెస్టు కావడం.. సీపీఆర్‌తో తిరిగి గుండె కొట్టుకోవడంతోపాటు నాడి సాధారణ స్థితికి వచ్చినా.. అపస్మారక స్థితి నుంచి ఆయన బయటపడలేదు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని మాదాపూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు.

మిగతా 3లో



### బుల్లెట్ గ్యాంగ్ లీడర్ గోపినాథ్

- ఎన్టీఆర్ కటౌట్ లతో తెలుగుదేశంలో క్రేజ్
- ఎన్టీఆర్ కుటుంబంతో సత్సంబంధాలు

03

### సౌందర్య, భూమికతో సినిమాలు

- నిర్మాతగా, ఫైనాన్షియర్ గా చిత్రసీమతో అనుబంధం
- కలిసిరాని సినిమాలు.. కలిసొచ్చిన రాజకీయాలు
- జూబ్లిహిల్స్ నుండి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మాగంటి రికార్డు

03



## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని... రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

జాతీయ రాజకీయాల్లో వాజ్ పేయి.. తెలంగాణలో దత్తాత్రేయ

పదవి ఉన్నా లేకున్నా దత్తన్నపై గౌరవం తగ్గదు

హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ.. కన్నులపండువగా కార్యక్రమం

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ రాష్ట్రపతి కోవింద్, వెంకయ్యనాయుడు


కార్యక్రమంలో గవర్నర్లు, కేంద్ర, రాష్ట్రమంత్రులు, ప్రముఖులు

వివరాలు 5లో

## పాకిస్థాన్‌పై ట్రంప్ పొగడ్తలు

- క్రెడిట్ ఇవ్వనందుకు భారత్ పై సెటైర్లు
- యుద్ధం ఆపింది తానేనంటూ మరోసారి బడాయి ముచ్చట్లు

05



# చరిత్ర సృష్టించిన కాంగ్రెస్

## దళితులకు 25శాతంకు పైగా మంత్రి పదవులు

### కేబినెట్‌లోకి .. వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్

ముదిరాజ్ కోటాలో వాకిటి శ్రీహరికి ఛాన్స్.. డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రునాయక్

రాజ్ భవన్ లో నిరాడంబరంగా ప్రమాణస్వీకారం.. అందరూ.. ఫస్ట్ టైం ఎమ్మెల్యేలే

కాంగ్రెస్ నుండి.. గెలిచింది ఏడుగురు బిసిలే.. అందులో ముగ్గురికి కేబినెట్ ఛాన్స్

ముఖ్యమంత్రి రేవంత్ కు, కాంగ్రెస్ హైకమాండ్ కు నూతన మంత్రుల ధన్యవాదాలు

సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్, రాజగోపాల్ కు బుజ్జగింపులు

సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ ఇంటికి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు.

**నూతన మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకి అభినందనలు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రామచంద్ర నాయక్‌కు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

**దళిత్ సర్కార్**

కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో ఏ కేబినెట్ లో లేని విధంగా 25 శాతం పదవులు దళితులకు కేటాయించి చరిత్ర సృష్టించింది. కాంగ్రెస్ పార్టీకి ఆది నుండీ ఎస్సీలు సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉండగా, ఇటీవల ఎస్సీవర్గీకరణ ను మొట్టమొదటగా చేసి దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని సాహసం చేసింది. ఇప్పటివరకు సిఎం కాకుండా.. 11మంది కేబినెట్ లో ఉండగా, ఇందులో ఇద్దరు ఎస్సీలు ఉన్నారు. ఇపుడు మరో ముగ్గురిని కేబినెట్ లోకి తీసుకోగా, అందులోనూ ఇద్దరు ఎస్సీలు ఉన్నారు. సీఎంతో కలిపి 15మంది ఉంటే అందులో 25 శాతానికి పైగా పదవులు దళితులకే దక్కాయి. తెలంగాణ రాష్ట్రంలో జనాభాను మించి దళితులకు కేబినెట్ లో చోటు కల్పించిన ఏకైక ప్రభుత్వంగా రేవంత్ సర్కార్ చరిత్రను క్రియేట్ చేసింది. బీఆర్ఎస్ పార్టీకి ఆది నుండీ ఎస్సీల విషయంలో మరకలు ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఛాంపియన్ గా నిలిచింది.

**ఆశావహులు అనేకమంది**

ఆశావహులు అనేకమంది ఉన్నా.. కాంగ్రెస్ హైకమాండ్ విలక్షణ ఫార్ములా రూపొందించింది. ఈ సారి ఓసిలకు లేవంటూ ఆ కోటా ఖాళీగా పెట్టి ఎస్సీ, బీసీలతో పదవులు భర్తీ చేసింది. ఓసిలకు లేవనడంతోనే ప్రధాన పోటీదారులుగా ఉన్న రెడ్లు, వెలమలు సైడయ్యారు. ఎస్సీలలో తీవ్ర పోటీ ఉన్నా.. ముఖ్యమంత్రి, హైకమాండ్ అటు విధేయతను, ఇటు హామీలను రెండింటినీ బ్యాలెన్స్ చేసింది. దీంతో మంత్రి పదవి ఆశించిన సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి , మదన్ మోహన్ తదితరులకు నిరాశే మిగిలింది.

**విధేయతకు పెద్దపీట**

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్నా అసెంబ్లీ గడప తొలిసారే తొక్కారు. వివేక్ కు ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు ఏఐసీసీ హామీని పొందడం, జిల్లా సమీకరణాల్లో ఎస్సీకి ఇస్తే మేలు జరుగుతుందని పార్టీ భావించడంతో ఛాన్స్ దక్కింది. అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి మధ్య చివరిదాకా దోబూచులాడినా సీనియర్ల మద్దతు లక్ష్మణ్ కు కలిసొచ్చినట్లు కనబడుతోంది. వాకిటి శ్రీహరి పదవిపై లోక్ సభ ఎన్నికల నాటి నుండి పార్టీలో ఏకాభిప్రాయం ఉంది. ముదిరాజ్ సామాజిక వర్గం నుండి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే, వివాద రహితుడు కావడంతో ఆయనకు ఛాన్స్ దక్కింది.

**రంగంలోకి మీనాక్షి**

హైకమాండ్ స్థిరమైన కటాఫ్ లు పెట్టుకోవడం, ఇంకా బెర్త్ లు ఖాళీగా ఉండడంతో అసంతృప్తులు అంత తీవ్రస్థాయిలో లేవు. మరోవైపు హైకమాండ్ అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం కూడా పార్టీ నేతల్లో ఆశలు సజీవంగా ఉంచింది. మోస్ట్ ఎలిజిబుల్ లీడర్ గా ఉన్నా రెడ్డి కావడం కారణంగానే రెండుసార్లు ఛాన్స్ మిస్ అయిన సుదర్శన్ రెడ్డి ఇంటికి ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ వెళ్ళి నచ్చజెప్పారు. ప్రేమ్ సాగర్ రావు ఇంటికి వెళ్ళి కూడా నచ్చజెప్నారు. హైకమాండ్ ఓసిలకు ఈ దఫా అవకాశం ఇవ్వకూడదని , దళిత, బిసివర్గాలకు బలమైన సందేశం పంపాలని భావించినందునే అవకాశం దక్కలేదని వివరించారు. దీంతో నేతలు ఏఐసీసీ నిర్ణయమే శిరోధార్యమన్నారు.





# వివేక్ వెంకటస్వామి అనే నేను..

## గడ్డం వివేక్‌కు ఎట్టకేలకు మంత్రి పదవి

16 ఏళ్ల రాజకీయ చరిత్రలో తొలిసారి అమాత్యయోగం

నాడు వైఎస్సార్ కేబినెట్ లో వినోద్.. నేడు రేవంత్ కేబినెట్ లో వివేక్

గడ్డం బ్రదర్స్ కు కలిసొచ్చిన కాంగ్రెస్



**హైదరాబాద్, మహా:** చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు ఎట్టకేలకు మంత్రి పదవి వచ్చింది. ఏఐసీసీ హైకమాండ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వివేక్ పట్ల సానుకూలంగా ఉండడంతో.. మంత్రి పదవికి అడ్డంకులు లేకుండా పోయాయి. వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన గడ్డం వివేక్, 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపీగా ఎన్నికయ్యారు. తర్వాత పరిణామాల్లో భాగంగా బీఆర్ఎస్, బీజేపీలలోకి మారారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. తాజాగా మంత్రి బెర్తును ఖరారు చేసుకున్నారు. వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన వివేక్ వెంకట స్వామి, సుదీర్ఘ కాలంగా ప్రజా జీవితంలోనే ఉన్నారు. 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేసి ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013 జూన్‌లో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. సరిగ్గా ఎన్నికల సమయంలో 2014లో టీఆర్ ఎస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత మళ్లీ 2016లో తిరిగి గులాబీ గూటికి చేరారు. టీఆర్ఎస్‌లో చురుగ్గా కొనసాగిన వివేక్ 2019లో పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆశించగా, దక్కకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉన్నారు.

**2023 ఎన్నికల సమయంలో రీ-ఎంట్రీ**

2019 ఎన్నికల తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరిన గడ్డం వివేక్, క్రియాశీలక నేతగా గుర్తింపు పొందారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, శాసనసభ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన బాధ్యతలు నిర్వర్తించారు. పెద్దపల్లి నుంచి వివేక్ బీజేపీ తరఫున పోటీ చేస్తారని భావించినప్పటికీ 2023లో హఠాత్తుగా మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వివేక్‌ను ప్రభుత్వం తాజాగా మంత్రివర్గంలోకి తీసుకుంది. ఏఐసిసి హైకమాండ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఇపుడు నిలుపుకున్నట్లు తెలుస్తోంది. వివేక్ కు మంత్రి యోగంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా రాజకీయ సమీకరణల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

**గడ్డం బ్రదర్స్ కు మినిస్టర్స్**

గతంలో వైఎస్సార్ కేబినెట్ లో బెల్లంపల్లి ఎమ్మెల్యే, వివేక్ సోదరుడు గడ్డం వినోద్ కు కార్మికశాఖా మంత్రి పదవిని ఇవ్వగా, ఇపుడు ఏఆర్ ఆర్ కేబినెట్ లో వివేక్ కు మంత్రి పదవి లభించింది. దీంతో తండ్రి కాకా వెంకటస్వామితో పాటు కొడుకులు ఇద్దరూ వినోద్, వివేక్ లు మంత్రి పదవులు సాధించినట్లయింది.

**వివేక్ వెంకట్ స్వామి రాజకీయ ప్రస్థానం :**

- వివేక్ వెంకటస్వామి ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి కుమారుడు
- తండ్రి జి.వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి వివేక్ ప్రవేశం
- 2009లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా గెలిచిన వివేక్ వెంకటస్వామి
- తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో బీఆర్ఎస్‌లో చేరిన వివేక్
- 2014 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరిక
- పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వివేక్
- 2016లో మళ్లీ బీఆర్ఎస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామి
- బీఆర్ ఎస్ ఎంపీ టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరం
- 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరిన వివేక్ వెంకటస్వామి
- 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరి చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్
- 2024లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా గెలిచిన వివేక్ కుమారుడు వంశీ

# అడ్లూరి లక్ష్మణ్ అనే నేను..

## అలుపెరుగని అడ్లూరి.. అడ్లూరి ని వరించిన అమాత్య పదవి

పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి పలువురికి ఆదర్శంగా నిలిచిన నేత

పేద నేతకు.. వెతుక్కుంటూ వచ్చిన పదవి



**మహా :** సాదనమున పనులు సమకూరు దరలోన అన్న నానుడి తాజాగా మంత్రి ఫదవి చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్ విషయంలో అతికినట్లు సరిపోతుంది. వరుస పరాజయాలు ఎదురైనా లెక్క చేయకుండా దాదాపు రెండు దశాబ్దాల పాటు అడ్లూరి లక్ష్మణ్ పోరు సాగించారు. ఆ పోరాట ఫలితంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసారే ఆయనను మంత్రి పదవి వరించింది. కాంగ్రెస్ పార్టీ సైనికుడిగా విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ సహా జెడ్‌పీటీసీ, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వివిధ పదవులు చేపట్టారు. సామాజిక సమీకరణాల కసరత్తులో భాగంగా అడ్లూరికి మంత్రి పదవికి దక్కడంతో అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టిన పట్టు విడవకుండా అలుపెరుగని ప్రయత్నం చేస్తే విజయం దాసోహమవుతుంది అనేందుకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిదర్శనంగా నిలిచారు. శాసనసభ ఎన్నికల్లో పరాజయాలు ఎదురైనా వెనుదిరగక, పోరాడి గెలిచిన మొదటిసారే అమాత్యయోగం వరించింది. అడ్లూరి 1968లో జన్మించారు. ఆ కాలంలోనే ఐటీఐతో పాటు ఇంటర్ పూర్తి చేశారు. విద్యాభ్యాసం నుంచే పాలిటిక్స్ మీద ఆసక్తి ఉన్న అడ్లూరి, ఎన్ఎస్‌యూఐతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1982 నుంచి 1985 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు. 1986నుంచి 1994 వరకు కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1996నుంచి 2001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2004లో నందిమేడారం నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2006లో ధర్మారం ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి జెడ్‌పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన ధర్మపురి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినా, విజయం వరించలేదు. అయితే 2010 నుంచి 2012 వరకు కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పని చేశారు. 2010లో మరోసారి ధర్మపురి నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రాగా, మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ నిరాశే ఎదురైంది. 2013 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో ధర్మపురి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 2018 నుంచి జగిత్యాల జిల్లా పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి, తొలిసారిగా అసెంబ్లీకి వచ్చారు. 2023 డిసెంబర్ 15న అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను రాష్ట్రప్రభుత్వం విప్‌గా నియమించింది. ప్రస్తుతం సామాజిక సమీకరణాల నేపథ్యంలో మాదిగ సామాజికవర్గ కోటాలో ఆయనకు కేబినెట్ బెర్త్ ఖరారయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మూడో మంత్రి పదవి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మూడో మంత్రి పదవి కోసం మాదిగ సామాజిక వర్గానికి చెందిన కవ్వంపల్లి సత్యనారాయణ, కాపు సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పోటీపడినా, మంత్రి శ్రీధర్ బాబు అండదండలతో అడ్లూరికి చోటు దక్కింది.

### ఇది అడ్లూరి ప్రస్థానం...

- 1968లో జన్మించారు
- ఆ రోజుల్లోనే ఐటీఐ, ఇంటర్ వరకు విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఎన్ఎస్‌యూఐతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.
- 198285 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్ష పదవి చేపట్టారు.
- 198694 వరకు కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.
- 19962001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
- 2004లో నందిమేడారం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడారు.
- 2006లో ధర్మారం ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి జడ్పీటీసీగా విజయం వరించింది.
- 2009లో ధర్మపురి నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- 2010 నుంచి 2012 వరకు కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా విధులు నిర్వహించారు.
- 2010లో మరోసారి ధర్మపురి నియోజకవర్గానికి ఉపఎన్నికల్లో పోటీచేసి ఓడారు.
- 201314 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు.
- 2014, 2018లో ధర్మపురి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.
- 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

# సర్పంచ్ టూ మినిస్టర్

## పాలిటిక్స్ లో తిరుగులేని వాకిటి శ్రీహరి

**ఫస్ట్ టైం ఎమ్మెల్యే.. మినిస్టర్ ఛాన్స్**

**రాష్ట్రంలో.. రెండో ముదిరాజ్ మంత్రి**

**ఏపని చేపట్టినా విజయమే**



**హైదరాబాద్, మక్తల్, మహా:** గ్రామ సర్పంచి నుంచి మొదలై అంచెలంచెలుగా ఎదిగిన వాకిటి శ్రీహరి ఇపుడు మినిస్టర్ అయ్యాడు. రాజకీయాల్లో చేరినప్పటి నుంచి ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ సహా పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ, నిబద్ధతతో శ్రమించిన వాకిటి శ్రీహరికి సామాజిక సమీకరణాల్లో భాగంగా అమాత్యయోగం వరించింది. వాకిటి శ్రీహరికి మంత్రి పదవితో రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి తాజాగా చోటు కల్పించినట్లైంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఒక్క ఈటల రాజేందర్ మాత్రమే ముదిరాజ్ సామాజిక వర్గం నుండి మంత్రి కాగా, ఆ సామాజికవర్గం నుండి రెండో మంత్రిగా వాకిటి శ్రీహరి చరిత్ర సృష్టించారు.

**సర్పంచ్ టూ మంత్రి**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు మరో మంత్రి పదవి దక్కింది. సామాజిక సమీకరణాల్లో భాగంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ శాసనసభ్యుడు వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలోకి తీసుకుంది. 2001లో మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో మక్తల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. అదే సమయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగానూ పని చేశారు. 2014లో జడ్పీటీసీగా, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గానూ సేవలందించారు. కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడిగానూ వ్యవహరించారు. 2022 నుంచి 2024 వరకూ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీ విభాగాలకు ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిపై శ్రీహరి 17,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శాసనసభ్యునిగా ఎన్నికైన మొదటిసారే శ్రీహరికి మంత్రి పదవి దక్కడం విశేషం.

**వాకిటి శ్రీహరి రెండో మంత్రి**

యూత్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి మొదలు వాకిటి శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. సుదీర్ఘకాలంగా పార్టీకి విధేయునిగా కొనసాగుతూ వస్తున్నారు. మంత్రి వర్గంలో బీసీలకు, అందులోనూ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారికి చోటు కల్పించాలన్న డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి పేరు వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన ఎమ్మెల్యేలలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీహరి ఒక్కరే.

**సీఎం రేవంత్ చెప్పినట్లే**

సామాజిక సమీకరణాలు, విధేయతను పరిగణలోకి తీసుకుని మంత్రివర్గాన్ని విస్తరిస్తే శ్రీహరికి మంత్రి పదవి తప్పకుండా దక్కుతుందనే ఊహాగానాలు మొదట్నుంచి చక్కర్లు కొట్టాయి. తాజాగా మంత్రి పదవి ఖరారుతో ఉత్కంఠకు తెరపడింది. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జూపల్లి కృష్ణారావు పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా వాకిటి శ్రీహరి రెండో మంత్రి అయ్యారు. లోక్ సభ ఎన్నికల సమయంలోనే మక్తల్ వేదికగా గెలిపిస్తే.. ముదిరాజ్ ను మంత్రిని చేస్తానని చెప్పారు. మహబూబ్ నగర్ లో స్వల్పతేడాతో ఓడినా మంత్రిని చేస్తానన్న హామీని సీఎం రేవంత్ నిలుపుకున్నారు.



# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

# కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గోపీనాథ్ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంత్రులు కిషన్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ప్రభుత్వం అధికారికంగా అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది.

**కన్నీళ్ళు పెట్టుకున్న కేసీఆర్**

సీనియర్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. మాగంటి గోపీనాథ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం గోపీనాథ్ భార్య, పిల్లలను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. గోపీనాథ్ కుమారుడు వాత్యల్సనాథ్‌ను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కష్టకాలంలో వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ పార్థివ దేహాన్ని చూసి కేసీఆర్ ఉద్వేగానికి గురయ్యారు. మాగంటి కుమారుడిని పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీలు కే ఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ జోగిన పల్లి సంతోష్ కుమార్, పువ్వాడ అజయ్, భాస్కర్ రావు, పద్మారావు గౌడ్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పార్టీ నేతలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి తదితర పార్టీ నేతలు మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.



# బుల్లెట్ గ్యాంగ్ లీడర్ గోపీనాథ్

## ఎన్టీఆర్ కటౌట్ లతో తెలుగుదేశంలో క్రేజ్

### ఎన్టీఆర్ కుటుంబంతో సత్సంబంధాలు

**హైదరాబాద్, మహా**

గోపీనాథ్ తండ్రి మాగంటి కృష్ణమూర్తి ఆంధ్రప్రాంతం నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడ్డారు. 1963 జూన్ 2వ తేదీన గోపీనాథ్ జన్మించారు. గోపీనాథ్ పుట్టి పెరిగిందంతా హైదరాబాద్ లోనే. హైదర్ గూడలో నివాసం ఉండేవారు. ఆయన తల్లి మహానంద కుమారి . ఆమెకు సినిమాలంటే ఇష్టం ఉండేది. అలా గోపీనాథ్ కు కూడా చిన్నతనంలోనే సినిమాపిచ్చి ఉండేది. హీరో కృష్ణ నటించిన "గూఢచారి 116, మోసగాళ్ళకు మోసగాడు" వంటి యాక్షన్ మూవీస్ చూసి ఆయనపై అభిమానం పెంచుకున్నారు గోపీనాథ్. తన అభిమాన హీరో కృష్ణకు అభిమాన నటుడైన యన్టీఆర్ అంటే తరువాతి రోజుల్లో విపరీతమైన ఆరాధనా భావం పెరిగింది. యన్టీఆర్ నటించిన అనేక పౌరాణిక చిత్రాలను చూసి ఆయనకు జేజేలు కొట్టేవారు గోపీనాథ్. ఆ రోజుల్లో తన మిత్రులతో కలసి గోపీనాథ్ గొడవలు చేయడం గట్రా చేసేవారు. ఆయనకు ఓ బుల్లెట్ ఉండేది. అలాగే ఆయన మిత్రులు కూడా బుల్లెట్స్ కొని అందరూ కలసి తిరిగేవారు. దాంతో గోపీనాథ్ గ్యాంగ్ ను 'బుల్లెట్ గ్యాంగ్' అంటూ పిలిచేవారు జనం. గోపీనాథ్ చదువు మందకొడిగానే సాగిందని చెప్పాలి. శ్రీవేంకటేశ్వర ట్యూటోరియల్స్ ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గోపీనాథ్ తరువాత డిగ్రీ అయిందనిపించారు.

**'బుల్లెట్ గ్యాంగ్'తో ర్యాలీ**

1983లో యన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత నుంచీ 'తెలుగుదేశం పార్టీ'పై అభిమానం పెంచుకొని కార్యకర్తగా మారారు. 1984 ఆగస్టులో యన్టీఆర్ ను బర్తరఫ్ చేసినప్పుడు గోపీచంద్ 'బుల్లెట్ గ్యాంగ్'తో ర్యాలీ చేశారు. దాంతో యన్టీఆర్ వీరాభిమాని, తరువాత మంత్రి అయిన శ్రీపతి రాజేశ్వర్ తో అనుబంధం ఏర్పడింది. ఆ పై 1985లో యన్టీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించినప్పుడు కూడా గోపీనాథ్ 'బుల్లెట్ ర్యాలీ' ఓ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలచింది. గోపీనాథ్ 'బుల్లెట్ ర్యాలీ' గురించి తెలిసిన అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.జి.రామచంద్రన్ సైతం వీరిని చెన్నై పిలిపించుకున్నారు. అక్కడ కూడా గోపీనాథ్ తన గ్యాంగ్ తో బుల్లెట్ ర్యాలీ నిర్వహించడం విశేషం! గోపీనాథ్ చురుకుదనం చూసిన యన్టీఆర్ ఆయనను 'తెలుగుయువత' అధ్యక్షునిగా నియమించారు. 1985 నుండి 1992 వరకు గోపీనాథ్ తెలుగుయువత అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989లో యన్టీఆర్ 'తెలుగుదేశం పార్టీ' ప్రతిపక్షంలో ఉండవలసి వచ్చింది. ఆ సమయంలో రామారావును తరచూ కలుసుకుంటూ ఉండేవారు గోపీనాథ్. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడే కేసీఆర్ తోనూ అనుబంధం ఏర్పడింది. 1987 నుండి 1989 దాకా 'హైదరాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ' (హుడా) డైరెక్టర్ గానూ పనిచేశారు గోపీనాథ్. 1990ల ఆరంభంలో ఖైరతాబాద్ కూడలిలోనూ, సెక్రటేరియట్ సమీపంలోనూ యన్టీఆర్ 'శ్రీక్రిష్ణపాండవీయం'లోని దుర్యోధనుని గెటప్ భారీ కటౌట్స్ ను ఏర్పాటు చేశారు గోపీనాథ్. దాంతో ఒక్కసారిగా గోపీనాథ్ పేరు తెలుగుదేశం పార్టీలో మారుమోగిపోయింది. యన్టీఆర్ కుటుంబసభ్యులతోనూ గోపీనాథ్ కు సత్సంబంధాలు ఉండేవి. అలా రాజకీయాల్లో ఒక్కోమెట్టూ ఎక్కుతూ వచ్చిన గోపీనాథ్ 1995లో 'పాతబస్తీ'తో నిర్మాత అయ్యారు.

**చంద్రబాబుకూ ఇష్టుడే**

తెలుగుదేశం పార్టీనే నమ్ముకొని ఉన్న గోపీనాథ్ కు చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజన తరువాత జరిగిన ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ తెలుగుదేశం అభ్యర్థిగా సీటును ఇచ్చారు. 2014లో జరిగిన ఈ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి మజ్లిస్ పార్టీకి చెందిన నవీన్ యాదవ్ పై తొమ్మిది వేలకు పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు గోపీనాథ్. అలా తొలిసారి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అడుగుపెట్టిన గోపీనాథ్ కొన్నాళ్ళకు అప్పటి టి.ఆర్.ఎస్. ప్రభుత్వంలోకి జంప్ అయ్యారు. దాంతో ఎందరో తెలుగుదేశం పార్టీ అభిమానులకు దూరమయ్యారు. తరువాత వారందరినీ చేరదీసి ఏ పరిస్థితుల్లో తాను పార్టీ మారవలసి వచ్చిందో వివరించారు. మళ్ళీ తనవాళ్ళను కలుపుకొని ముందుకు సాగిన గోపీనాథ్ 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విష్ణువర్ధన్ రెడ్డిపై పదహారు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ గా మారిన టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. గోపీనాథ్ మూడోసారి ప్రఖ్యాత క్రికెటర్ మహ్మద్ అజరుద్దీన్ పై 16.337 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం అందరినీ ఆశ్చర్యపరచింది. అలా జూబ్లీ హిల్స్ నియోజక వర్గంలో 'హ్యాట్రిక్' సాధించిన తొలి నాయకునిగా గోపీనాథ్ చరిత్రలో నిలిచారు.



## కుటుంబం ఇదీ

**గోపీనాథ్ కు భార్య సునీత, కొడుకు వాత్సల్యనాథ్, కూతుళ్ళు దివ్య అక్షరనాగ్, దిశిర ఉన్నారు. తారకరత్న హీరోగా గోపీనాథ్ నిర్మించిన 'భద్రాద్రిరాముడు' చిత్రాన్ని పెద్ద కూతురు దివ్యఅక్షర నాగ్ పేరిటే బ్యానర్ పెట్టి నిర్మించారు. తరువాత తీసిన 'నా స్టైలే వేరు' సినిమాను చిన్నకూతురు దిశిర పేరిట బ్యానర్ ఏర్పాటు చేసి తెరకెక్కించారు. అంతకు ముందు 'ఆర్.కె.ఫిలిమ్స్' పతాకంపై చిత్రాలు నిర్మించారు గోపీనాథ్. ఏది ఏమైనా సినిమారంగంలో అంతగా సక్సెస్ కాకున్నా గోపీనాథ్ రాజకీయరంగంలో జూబ్లీ హిల్స్ వంటి కీలక నియోజకవర్గానికి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం విశేషం.**

# సౌందర్య, భూమికతో సినిమాలు

## నిర్మాతగా, ఫైనాన్షియర్ గా చిత్రసీమతో అనుబంధం

### కలిసిరాని సినిమాలు.. కలిసొచ్చిన రాజకీయాలు

### జూబ్లిహిల్స్ నుండి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మాగంటి రికార్డు

**హైదరాబాద్, మహా**

మాగంటి గోపీనాథ్ సంచలనాలకు మారుపేరు. హైదరాబాద్ లో టాక్ ఆఫ్ ది సిటీగా హైదరాబాద్ లోని అతి పెద్ద శాసన సభ నియోజక వర్గాల్లో ఒకటైన జూబ్లీ హిల్స్ నుండి వరుసగా 2014, 2018, 2023 సంవత్సరాల్లో మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలిచారు. రాజకీయ రంగంలో శాసనసభ్యుడు కాకపూర్వం మాగంటి గోపీనాథ్ నాలుగు చిత్రాలు నిర్మించారు. 1995లో ఉప్పలపాటి నారాయణరావు దర్శకత్వంలో 'పాతబస్తీ' చిత్రంతో నిర్మాతగా మారారు గోపీనాథ్. సురేశ్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'పాతబస్తీ' అంతగా అలరించలేక పోయింది. తరువాత 2000లో రాజశేఖర్ హీరోగా 'రవన్న' సినిమా నిర్మించారు. బి.గోపాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తన అభిమాన హీరో కృష్ణతో ఓ కీలక పాత్రను ధరింప చేశారు గోపీనాథ్. సౌందర్య నాయికగా తెరకెక్కిన ఈ సినిమా సైతం జనాన్ని ఆకట్టుకోలేక పోయింది. తారకరత్నను హీరోగా పరిచయం చేస్తూ ఒకే రోజున తొమ్మిది సినిమాలు మొదలయ్యాయి. అందులో గోపీనాథ్ 'భద్రాద్రి రాముడు' మూవీ ఒకటి. 2004లో వచ్చిన ఈ చిత్రానికి సురేశ్ కృష్ణ దర్శకుడు. ఈ చిత్రం కూడా గోపీనాథ్ కు తీపి రుచి చూపించలేక పోయింది. తన 'రవన్న' హీరో రాజశేఖర్ తో 2009లో 'నా స్టైలే వేరు' సినిమా తెరకెక్కించారు. జి. రామ్ ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భూమిక నాయికగా నటించారు. ఇది కూడా గోపీనాథ్ కు చేదు అనుభవాన్ని మిగిల్చింది. అలా సినిమా రంగంలో నిర్మాతగా సక్సెస్ సాధించలేకపోయిన గోపీనాథ్ రాజకీయరంగంలో ఎమ్మెల్యేగా 'హ్యాట్రిక్' సాధించడం విశేషం!





# జూబ్లిహిల్స్‌కు బైపోల్

## బీహార్ ఎన్నికలతో కలిసి షెడ్యూల్

### సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో ఎలక్షన్.. బైపోల్ పై కాంగ్రెస్ గురి

### ఏడాదిన్నరలో ఇద్దరు ఎమ్మెల్యేలను కోల్పోయిన బిఆర్ఎస్




**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాలమరణంతో ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి బైపోల్ రానుంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో కలిసి జూబ్లిహిల్స్ బైపోల్ షెడ్యూల్ రానుంది. నవంబర్ 22 వరకు బిహార్ అసెంబ్లీకి గడువు ఉండగా, గత టర్మ్ లో అక్టోబర్ 28 నవంబర్ 5 మధ్య ఎన్నికలు జరిగాయి. పండుగల నేపథ్యంలో ఈ సారి ఇంతకు ముందుగానే షెడ్యూల్ వస్తుందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా ఏదైనా అసెంబ్లీస్థానం ఖాళీ అయితే ఆరుమాసాల్లోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బిహార్ షెడ్యూల్ తో కలిసి జూబ్లిహిల్స్ బైపోల్ వచ్చే అవకాశాలున్నాయి. ఇంకా మూడున్నరేళ్ళ పదవీకాలం ఉండడంతో అన్ని రాజకీయ పార్టీలు ఈ సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డుప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో బిఆర్ఎస్ సీటు కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నుండి విజయం సాధించింది. జూబ్లిహిల్స్ సీటు అందుకు భిన్నం. రెండు తెలుగు రాష్ట్రాలకు హార్ట్ లాంటి స్థానం కావడంతో బిఆర్ఎస్ కు ఇది అత్యంత ప్రతిష్టాత్మకం. ఇటీవల లోక్ సభ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత లభించింది. బిజెపి కూడా గతంలో ఈ సీటు నుండి ప్రాతినిధ్యం వహించింది. బైపోల్ పై రాజకీయ వ్యూహాలు.. సమర సన్నాహాలను పార్టీల పెద్దలు రచిస్తున్నారు.

**ఎవరెవరు?**

మాగంటి గోపీనాథ్ కుటుంబం కేసీఆర్ కుటుంబానికి అత్యంత దగ్గర. కేటీఆర్ కుటుంబానికి, మాగంటి కుటుంబానికి స్నేహసంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాగంటి కుటుంబం నుండే మరోసారి అభ్యర్థిని నిలిపే అవకాశాలున్నాయి. రెండు తెలుగురాష్ట్రాల కమ్మ సామాజిక వర్గ నేతలు కూడా మాగంటి కుటుంబానికి అండగా ఉండే అవకాశాలున్నాయి. ఈ స్థానంలో పిజెఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి కూడా బిఆర్ఎస్ నుండి కీలక నేతలుగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి మరోసారి అజహరుద్దీన్ కు అవకాశం లభించవచ్చని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అజహరుద్దీన్ గెలిస్తే కేబినెట్ లో మంత్రిగా కూడా తీసుకునే అవకాశాలున్నాయి. అయితే ఈ సీటు కోసం ఇతర నేతలు కూడా ప్రయత్నాలు చేసే అవకాశాలున్నాయి. బిజెపి నుండి లంకల దీపక్ రెడ్డికి అవకాశం లభిస్తుందని విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో వీటిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

## హరిత కంబళం

**ప్రకృతి మాలిక**

ప్రకృతి చిత్రకారుడు
హరిత కుంచెతో
కప్పుతున్నాడు
ధరణి కంబళం

హరిత కంబళంలో
తల్లి భూమి నిద్రలేస్తుంది
మధుర స్వప్నాలు

ప్రకృతి దేవుడు
తన కుంచెతో
రంగులద్దుతున్నాడు
అనంత కళలో

వరి చేలలో
గీతలు గీస్తున్న నీటి కాలువలు
జీవన రేఖలు

సూర్యకాంతిలో
బంగారు తేనె కారుతుంది
వరిపొలాలపై

కవుల కలలలో
పచ్చని వర్ణాలు మాట్లాడే
మౌన గీతాలు

నీలి పర్వతాలు
మౌన సాక్షులుగా
చూస్తున్నాయి
ఈ కళా యజ్ఞాన్ని

హృదయాలలో పుట్టే
కవిత్వ వర్ణాలు కలిసిపోతాయి
ఆకాశ రంగులతో

అనంత సృజనలో
మనమంతా చిన్న బిందువులం
మహా కళాఖండంలో

శాశ్వత సౌందర్యం
దివ్య కుంచె వేసిన రంగులు
కాలాతీత గీతం

- ప్రవిరారా
విజయ రామ రాజు



# ముస్లిం స్త్రీల వెతల్ని చిత్రించిన కథలు


## హార్ట్ ల్యాంప్‌కి బుకర్ ప్రైజ్ పుస్తక సమీక్ష

**- ఆడెపు లక్ష్మీపతి, 9701227207**


ఇప్పటి వరకు బుకర్ ప్రైజ్ అందుకున్నభారతీయ లేదా భారతీయ మూలాలున్న రచయితలు : వి ఎస్ నైపాల్, సాల్మన్ రష్దీ, అరుంధతి రాయ్, అరవింద్ ఆదిగా, కిరణ్ దేశాయ్, కజువో ఇషిగురో, హరి కుంజ్రు, రూపి కౌర్. ఇటీవలి కాలంలో 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' అందుకున్న వారిలో ఇద్దరు భారతీయ రచయిత్రులుండటం విశేషం. 'Tomb of Sand '(హిందీ) నవలకి 2022లో గీతాంజలిశ్రీ, Heart Lamp(కన్నడ) కథా సంపుటికి 2025 లో బాను ముస్తాక్ ఈ అవార్డు గెలుచుకున్నారు.

కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ పై 197080నడుమ కర్నాటకలో ప్రధానస్రవంతి సాహిత్యంలో అగ్రవర్ణ , పురుషాధిక్య ప్రాబల్యానికి వ్యతిరేకంగా ఎగసిన 'బందయా సాహిత్య ఉద్యమ' ప్రభావం వుంది. సామాజికంగా అణగారిన, అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు, స్త్రీలు తమ నిజజీవిత అనుభవాలను వాస్తవికంగా అక్షరీకరించాలని ఆ ఉద్యమం పిలుపునిచ్చింది. ఈమె 1990 నుంచి 2023 వరకు రాసిన అనేక కథల్లోంచి ఎంపిక చేసిన 12 కథలను ఇంగ్లిష్ ' పెన్' అవార్డ్ గ్రహీత దీపా భాస్తి ఆంగ్లంలోకి అనువాదం చేయగా 'అండ్ ఆదర్ స్టోరీస్' ( షెఫీల్డ్, లండన్) ప్రచురణసంస్థ 'Heart Lamp' టైటిల్ తో 235 పేజీల పుస్తకంగా ఈ సంవత్సరమే ప్రచురించింది. మతం, పితృస్వామ్యం, అణచివేత, జెండర్ అసమానత, హింస..చుట్టూ అల్లిన ఈ కథలు కర్నాటక, దక్షిణ భారత దేశంలో ముస్లిం స్త్రీలు పడుతోన్న దైనందిన కష్టాలు, కడగండ్లను కళ్ళకు కట్టినట్టు చిత్రించాయి. మన దేశంలోనే కాదుఈ పాత్రలు, విషాదగాథలు ప్రపంచమంతటా కన్పిస్తాయి. ఈ సంపుటిలో వున్నవి contrived plots కాదు వృత్తిగతంగా, వ్యక్తిగతంగా రచయిత్రి సన్నిహితంగా పరిశీలించిన జీవితాల శకలాలు.

మొదటి కథ 'Stone Slabs for Shaista Mahal', ఇంకా పిల్లలు కలగని కొత్త జంట ముజాహిద్ - జీనత్, ఆరుగురు పిల్లలని కని మరో నలుసును కడుపున మోస్తున్న దంపతులు ఇఫ్తికర్ - శయిస్తా ల చుట్టూ నడుస్తుంది. శయిస్తా పెద్ద కూతురు ఆసిఫా, తండ్రి ప్రోత్సాహం లేక హై స్కూల్ తోనే చదువు ఆపేసి చిన్న పిల్లలైన తోబుట్టువుల ఆలనాపాలనా చూస్తూ తల్లికి తోడుగా వుండటం చూసి జీనత్ జాలి పడుతుంది. శయిస్తా పట్ల తనకు అంతులేని ప్రేమ అనీ , దానికి గుర్తుగా తాజ్ మహల్ లాంటిది నిర్మించడానికీ తాను సిద్ధమేనమేనని ఇఫ్తికర్ అన్నప్పుడు వారి అన్యోన్యతకి, అనురాగానికీ జీనత్ ఆశ్చర్యపోతుంది, ఆనందపడుతుంది. కానీ అతని మగ బుద్ధి తాలూకు నిజస్వరూపం చూశాక జీనత్ కి అసహ్యం వేస్తుంది.ప్రసవానంతరం శయిస్తా మరణించిన నలభయ్యవ రోజు ఫాతిహా అయిన మర్నాడే పిల్లల సంరక్షణ కోసం అంటూ అతడు మరో స్త్రీని పెళ్ళాడతాడుపడుచు పెళ్ళాంతో ఇఫ్తికర్ పడకగదిలో వుంటే అతని కూతురు ఆసిఫా ఇంటి బయట రెండు నెలల పసిగుడ్డును చంకన మోస్తూ తమ్ముళ్ళు, చెల్లెళ్ళను ఆడిస్తూ వుంటుంది!'Fire Rain'మసీదు కమిటీ ప్రెసిడెంట్, రాజకీయ కార్యకర్త కూడాఅయిన ముతావల్లి ఉస్మాన్ సాహెబ్ సంఘర్షణని ఆర్ద్రంగా చిత్రించింది. జ్వరంతో బాధ పడుతోన్న మూడేళ్ళ కొడుకుని తడిగుడ్డతో తుడుస్తూ భార్య ఆరిఫా నిద్ర లేకుండా హాల్ లో వుంటే,ఇంటి ఆస్తిలో తన వాటా కోసం వచ్చినచెల్లెలు, ఆమె భర్త పక్క గదిలోహాయిగా పడుకునుంటారు.మరో చెల్లెలు తన కొడుకు ఉద్యోగం కోసం సిఫార్సు అభ్యర్తించేందుకు వచ్చింది. ఒక అభాగ్యురాలు తన భర్త ఆపరేషన్ కోసం సహాయం అర్థించింది. ఇంకొకాయన కూతురి పెళ్లి కి ఆర్టిక సాయం అడుగుతాడు. అతడికి కుడి భుజం వంటి దావూద్ వచ్చి నిసార్ అనే ముస్లిం వ్యక్తి మృతదేహాన్నిహిందూ స్మశాన వాటికలో పాతిపెట్టి పోలీసులు ఇస్లాం ని కావాలని అవమాన పరిచారని చెప్పగానే అంతటా ఉద్రిక్తత. కుళ్లిపోయి వున్న శవాన్ని వెలికి తీయించి ముస్లిముల ఆచారాల ప్రకారం ఖబర్స్తాన్ లో అంత్య క్రియలు జరిపిస్తారు. ఆ తంతు జరుగుతుండగా తాగుబోతు నిసార్ గుంపులో వాళ్లకు కనపడి వెక్కిరిస్తాడు. నిసార్ బతికే వుంటే మరి ఆ మృత దేహం ఎవరిదీ..ముస్లిందా లేక హిందువుదా? సమాధానం దొరకక ముతావల్లి సాహెబ్ తల పట్టుకుంటాడు. గోలగోలగా అరిచే కాకులను, 'హక్కుదారు అలిగితే అగ్ని వర్షం కురుస్తుంది' అనే అర్థం వచ్చే ఫకీర్ పాటని సింబాలిక్ గా ప్రస్తావించడం జరిగింది. 'Red Lungi'లో ముస్లిం సాంప్రదాయం ప్రకారం మగపిల్లలకు 'సుంతీ' (ఖత్న) చేయించే తంతుని విపులంగా చిత్రించారు రచయిత్రి. వేసవి సెలవుల్లో ఇంటిలో తిష్ట వేసి అల్లరి చేస్తున్న మనుమలు, మనుమరాళ్ళ గోల తప్పించుకునేందుకు రజియా మసీదు ప్రాంగణంలో సామూహిక 'సుంతీ' కి పథకం వేసి భర్త లతీఫ్ అహ్మద్ని ఒప్పిస్తుంది. పేర్లు నమోదు చేయించుకున్న బాలురకు సుంతీ అయ్యాక గోధుమలు, కుడుకలు దానంగా ఇస్తారు దంపతులు, దానానికి ఆశ పడి ఒక పేద తల్లి తన కొడుక్కి రెండోసారి సుంతీ చేయించాలనుకుంటుంది, ఆమెకి డబ్బులిచ్చి పంపిస్తారు. సామూహిక తంతులో పాల్గొన్న బయటి పిల్లలు ఆరోగ్యంగానే వుంటారు, కానీ డాక్టర్ ద్వారా ఆసుపత్రిలో సుంతీ చేయించిన రజియా సొంత కొడుకు సమద్ ఇన్ఫెక్షన్ బారినపడిఅందరినీ కలవరపెడతాడు.










టైటిల్ స్టోరీ 'Heart Lamp' పెళ్ళయి పిల్లలయాక సుఖమూ, శాంతి,జీవితేచ్ఛ కోల్పోయిన మేహ్రూన్ అనే దీనురాలి స్థితిని వర్ణించిన కథ. పెనిమిటి ఇనాయత్ బయటి తిరుగుళ్ళు, చేష్టలు ఇంకేమాత్రం భరించలేక మెహరూన్ పుట్టింటికి వస్తుంది; అమ్మానాన్నలు, అన్నదమ్ములు ఆమెదే తప్పన్నట్టుగా మాట్లాడతారు, నచ్చజెప్పి తిరిగి ఇనాయత్ దగ్గరికి తీసుకెళ్ళి దింపేస్తారు. లోకంలో తనకు తోడు ఎవరూ లేరన్న తీవ్రనిరాశ నిస్పృహల్లో పడిపోయి ఆమె ఒకరాత్రి వొంటిమీద కిరసనాయిల్ పోసుకుని అగ్గిపుల్ల వెలిగించడానికి సిద్ధమవగా పెద్ద కూతురు సల్మా వచ్చిఆమె కాళ్ళను వాటేసుకుని ' అబ్బా ఒక్కడి కారణంగా చచ్చిపోవాలను కుంటున్నావా..మరి నీ పిల్లలైన మమ్మల్ని అనాథలని చేసి పోతావా ..వద్దమ్మా వద్దు ' అని ఏడుస్తుంది, తల్లి మనసు మారుస్తుంది.

మరో కథ 'High HealedShoe' ఆస్తి ఆడంబరాలు, అవి సాధించాలన్న తపన.. అన్యోన్యంగా వున్న అన్నదమ్ముల కుటుంబాల నడుమ దూరాన్ని పెంచిన వైనాన్ని చిత్రించింది. సెలవులు గడిపేందుకు సౌదీ నుంచి మహబూబ్ - నసీమా దంపతులు ఇండియా వస్తారు. వదిన నసీమా వేసుకున్న అందమైన హై హీల్ చెప్పులను చూసి నయాజ్ ఖాన్ కొంచెం ఈర్ష్య చెందుతాడు, అవి తన చెల్లెలికో, భార్యకో ఇస్తే బాగుండు ననుకుంటాడు. అతని మనసు కనిపెట్టిన నసీమా పలు జాగ్రత్తలు తీసుకుంటుంది, స్త్రీ సహజబుద్ధిని, సందర్భాన్ని, పరిస్థితిని బట్టి ఆలోచనలు, అభిప్రాయాలు మారే మనుషుల మనస్తత్వాన్నిపొరలు పొరలుగా చూపిన కథ ఇది. పెనిమిటి కొనిచ్చిన కొత్త హై హీల్ చెప్పులతో రోడ్డు మీద నడవలేక ఆరిఫా తీవ్ర అవస్థ పడుతుంది, చివరికి వాటిని తెంపి అవతల పడేస్తుంది. ఆమె అవస్థని ఏకకాలంలో ఆమె కడుపులోని బిడ్డ అనుభవించే బాధగా వర్ణించడంలో సర్రియలిజం చాయలు కనిపిస్తాయి.

'A Decision of the Heart'ఒక కొడుకు విచిత్రమైన నిర్ణయాన్ని గురించిన కథ. తల్లిని అమితంగా ప్రేమించే పండ్ల వ్యాపారి యూసుఫ్; అతని భార్య అఖిలకు అత్తగారు మెహబూబ్ బీ అంటే పడదు ; అత్తని, మొగుడిని రోజూ సాధిస్తుంది, తిడుతుంది. చివరికి, తల్లికి మరో పెళ్లి చేసి ఇంట్లోంచి పంపించాలన్న నిర్ణయాన్ని ప్రకటిస్తాడు యూసుఫ్. అందరూ విస్మయం చెందినా కొడుకు, కోడలు సుఖంగా ప్రశాంతంగా ఉండాలంటే తాను నికా చేసుకొని వెళ్ళిపోవడమే పరిష్కారం అని తల్లి పెద్దల ముందు చెబుతుంది.'Black Cobras'వరుసగా ముగ్గురు ఆడపిల్లల్ని కన్నందుకు మొగుడు యాకూబ్ చేత నిర్దాక్షిణ్యంగా గెంటి వేయబడ్డ అభాగ్యురాలు అష్రాఫ్ దీనగాథ. చలిలో పసిపిల్లల్ని వెంటేసుకుని ఆమె అనేక విన్నపాలు చేసిన మీదట ముతావల్లి ఖాదర్ సాబ్ ఒకరోజు మసీదులో పంచాయితీ పెట్టిస్తాడు.ముతావల్లి అండ చూసుకుని అప్పటికే మరో పెళ్లి చేసుకున్న యాకూబ్ అందరి ముందే అష్రాఫ్ ని తిట్టి కొట్టి మెట్ల మీంచి నెట్టేస్తాడు, ఆమె చంకలోని ఏడాదిన్నర పాప తలకి దెబ్బ తగిలి ప్రాణాలు విడుస్తుంది. పాప శవయాత్రకు సన్నాహాలు ఆరంభమవుతాయి.ఖాదర్ సాబ్ పాపిష్టివాడని అక్కడి స్త్రీలు అతని భార్య అమీనా సహా తిడతారు, నరకంలో అతణ్ణి నల్లత్రాచులు కాటేస్తాయని శాపనార్థాలు పెడతారు. ఉత్తమ పురుష దృష్టి కోణంలో సాగిన కథ 'Soft Whispers'అనేక అనుభూతులు, బాంధవ్యాల తీపిరుచి అందించిన బాల్యజ్ఞాపకాల నెమరువేత. పదేళ్ళ వయసప్పుడు తనని చిలిపిగా ముద్దు పెట్టుకున్న అబిద్ ఆతను ఇప్పుడు దర్గా లో గురువు చాలా ఏళ్ల తర్వాత కలిసినప్పుడు, ఆ ఘటన జ్ఞాపకముంచుకున్నాడా అని అతని కవళికల్లో ఆశగా వెతుకుతుంది నెరేటర్. 'A Taste of Heaven' చిన్నచిన్న కలతల్ని, కల్లోలాల్ని క్రమంగా అధిగమించిన ఒక కుటుంబం కథ.భార్య షమీం బాను విచిత్రంగా ప్రవర్తించడం ఆరంభించడంతో సాదత్ ఇంటిలో సమస్యలు మొదలవుతాయి. అతని మేనత్త బీ దాది , తన జా నమాజ్ ని పిల్లలు మైల చేసినందుకు తీవ్రంగా అలిగి అన్నపానీయాలు మానేయడంతో కొత్త చీకాకులు తలెత్తుతాయి. మనవడు, మనవరాళ్ళు చిన్నడ్రామా ఆడి ఆమెకి పెప్సీ రుచి చూపించి, అది ఆబ్ ఏ - కౌసర్ అనీ, ఆమె స్వర్గంలో తన పెనిమిటి సరసన హౌరీల సేవలో వున్నట్టు నమ్మించడంతో ముసలమ్మ తెగ సంతోషిస్తుంది. 'The Shroud'లో , జామ్ జామ్ నీళ్ళలో ముంచిన కఫన్ ని తెచ్చివ్వమని యాసీన్ బువా షాజియాకి డబ్బు ఇస్తుంది, మక్కా యాత్రలో షాజియా ఆ విషయం మర్చిపోతుంది. యాసీన్ మరణించినప్పుడు ఆమె కొడుకు వచ్చి కఫన్ అడుగుతాడు. మక్కా విశేషాలు, వాగ్దానం నేరవేర్చలేకపోయిన షాజియా అపరాధభావన, పాశ్చాత్తాపం కథలో బాగా వర్ణితమైనాయి.'The Arabic Teacher and Gobi Manchuri'యువ మౌల్వీ హజ్రత్ వెర్రి అభిరుచిని గురించిన కథ. తాను పిచ్చిగా



-ఆడెపు లక్ష్మీపతి

ఇష్టపడే గోబీ మంచూరియా వండి పెట్ట గల అమ్మాయిని భార్యగా కోరుకుంటాడు మౌల్వీ. చివరికి భార్య లభిస్తుంది కానీ కథ వేరవుతుంది. అతని గురించి ముందే తెలిసిన లాయర్ విడాకులు కోరి వచ్చిన ఆ అమ్మాయి కాపురం నిలబెట్టేందుకు గోబీమంచూరియా వండి పెట్టడమెలాగో నేర్పించాలనుకుంటుంది. సంపుటిలోని చివరి కథ 'Be a Woman Once , Oh Lord' దేవుడికి ఒక విన్నపం లాంటిది.ఆడదానిగా, ముస్లిం స్త్రీగా పుట్టినందుకు పురుషుని చేతిలో ఆటబొమ్మగా తాను ఎన్ని బాధలు అనుభవిస్తున్నదో వివరిస్తూ 'భూమ్మీద సకల జీవరాశిని, ప్రకృతి అందాలను సృష్టించిన ఓ దేవుడా .. ఈ ప్రపంచాన్ని మళ్ళీ నిర్మించాలని నువ్వు భావిస్తే , స్త్రీలను పురుషులను మళ్ళీ సృష్టించాలని సంకల్పిస్తే, అనుభవం లేని కుమ్మరి లా వ్యవహరించకు ..భూమ్మీదకు ఒక స్త్రీగా రా ప్రభూ' అని వేడుకుంటుంది నేరేటర్.

కథల్లో థీమేటికల్వైవిధ్యం కొరవడ్డట్టు పాఠకునికి అనిపించినా, రచయిత్రి బాధితులతో మమేకమై తన ఫీలింగ్స్ కి చక్కని శైలిలో అక్షర రూపమిచ్చినవి కాబట్టి ఆసక్తిగా చదివిస్తాయి.కథలన్నింటిలో స్వేచ్ఛాయుత కథనం, కన్నడేతర (ఉర్దూ, అరబ్బీ) పదాల వాడకం, (సహజత్వం కోసం ఇంగ్లిష్ అనువాదంలో కూడా అమ్మీ, అజ్జీ, అబ్బాజాన్, హదిత్, జన్నత్, షరియత్, జనాజా, కలీమా, షైతాన్ ..వంటి ఉర్దూ పదాలను; అక్కా, అన్నా, చిక్కమ్మా, దొడ్డమ్మా ..వగైరా స్థానిక పదాలను ఇటాలిక్స్ లో పెట్టకుండా అలాగే వాడారు), ఒక వర్గానికి చెందిన వంటకాలు, ఆహారపదార్థాల ప్రస్తావన, నిర్మోహమాటమైన సామాజిక వ్యాఖ్యానం, పురుషాధిక్య భావజాలానికి, చాందసత్వానికి దన్నుగా నిలిచిన మతసూత్రాలపై విమర్శ కనపడతాయి. అదీ ఈ కథల ప్రత్యేకత.

---

**విస్మృత బీసీ సాహిత్యం**

# జ్ఞాని బూర్ల విఠల్



- డా. సంగిశెట్టి శ్రీనివాస్

బీసీల సృజనకు సాహిత్య చరిత్రలో గౌరవ స్థానం దాదాపుగా మృగ్యం. చాలా సార్లు మూల వనరులు అందుబాటులో లేనందువల్ల వారి గురించి అందరికీ తెలియకుండా పోతున్నది. వాటిని పునర్ముద్రించేందుకు శ్రద్ధ లేక పోవడం, ఒక వేళ ఎవరైనా అలభ్యంగా ఉన్నవాటిని అచ్చువేద్దామని ప్రయత్నించినా వాటిని మూల వనరులను దొరకబట్టడం కష్టసాధ్యమవుతున్నది. అట్లాంటి అరుదైన శతకము 'సువర్ణ జ్ఞానబోధిని' దాదాపు 90 ఏండ్ల క్రితం సామాజిక సంస్కరణాభిలాషతో సరళ సుబోధకంగా ఈ శతకాన్ని బూర్ల విఠల్ రాసిండు. ఈ పద్యకృతి గురించి ప్రామాణికంగా మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర రాసిన మల్యాల దేవిప్రసాద్ యాదవ్కు కూడా ఈ రచన తెలియదు. తెలుగు సాహిత్యకోశంలోనూ, శాస్త్రుల రఘురామశర్మ మెదక్ జిల్లా సర్వస్వం, ఇతర తెలుగు సాహిత్య చరిత్ర రచనల్లో ఈయన గురించి ఎలాంటి సమాచారం లేదు. ఒక్క బెల్లంకొండ సంపత్కుమార్ తాను రాసిన 'మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర'లో ఈ కవిని ప్రస్తావించాడు. అది రేఖామాత్ర స్పర్శ మాత్రమే! ఇప్పుడీ కవి గురించి మాట్లాడుకుందాం.

పద్మశాలి దంపతులు లక్ష్మాంబ, బలరామయ్యలకు మెదక్ జిల్లా పాతూరులో 1898లో జన్మించారు. 1970లో చనిపోయారు. ఈయన కవితా గురువు వైశ్యుడైన కొడిమెల మల్లయ్య. 'సుజ్ఞాన బోధిని' ప్రథమ భాగము అని రాసి ఉన్న ఈ శతకం మకుటం ''భక్తజన పోషక సద్గురూ భారకర్త, పాతపురి నిలయ దేవ శ్రీభౌమనార్య' అని ఉన్నది. ఈయన మొత్తం నాలుగు భాగాల్లో ఈ శతకాలను రాసిండు. అయితే నాకు మొదటి భాగం మాత్రమే లభించింది. దాంట్లోనే ''ఈ సువర్ణ సుజ్ఞానబోధిని' ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ భాగములు గల ఈ నాల్గు పుస్తకములు నా యిష్ట పూర్వకముగా సర్వహక్కులు కొండా వీరయ్య పుస్తకముల వ్యాపారము శికింద్రాబాదు గారికి వ్రాసి యిచ్చి వున్నాను'' అని 45 పేజీల పుస్తకము చివర్లో పేర్కొన్నాడు. అంతేగాదు కొండా వీరయ్య పుస్తకాల ప్రచురణను మెచ్చుకుంటూ ఆరంభంలో ఒక పద్యం రాసిండు. 1937లో ఏడో నిజామ్ సిల్వర్ జూబిలీ ఉత్సవాల సందర్భంగా ఆయనను స్తుతిస్తూ కవి ఉస్మానలీఖాన్ ఫోటోతో సహా ప్రచురిస్తూ ఇట్లా రాసిండు.

గీ. ''పురుషులందున పుణ్య పురుషుండు యితడు
నసగ మహిబూబు భాషాకు నాత్మజుండు
ప్రేమ గలిగించు ప్రేమ నైజాం గారు
పరగ శృంగార పట్టణ ప్రభు యితండు

ఈ శతక గ్రంథములో కవి తాను సమాజంలో చూస్తున్న దుర్వర్తనలను నిరసిస్తూ హితబోధ చేస్తూ రాసిండు. సుమతి శతకము, వేమన శతకము, అయ్యనకోట పార్థసారథి శెట్టి కుమార శతకము మాదిరిగా నీతి బోధ చేసిండు. సామాజిక వివక్షలను, దుర్మార్గాలను, దొరల దౌర్జన్యాలను, అవాంఛనీయ ఆధునిక పోకడలను, గురు, శిష్య బాధ్యతలను అన్నింటికీ మించి 90 ఏండ్ల కిందటి మనుషుల ఆలోచనలను అక్షరబద్ధం చేసిండు. ఇందులో కవి విరివిగా ఇంగ్లీషు, పదాలు వాడిండు. ప్రధానంగా సీసగీత పద్యాల్లో రచన సాగినప్పటికీ అక్కడక్కడ కంద, చంపక, ఉత్పలమాల పద్యాలు కూడా ఉన్నాయి. సామాజిక విషయాలు, పౌరాణికాల పట్ల పూర్తి అవగాహనతో కొన్ని సార్లు అనివార్యమైన మొరటు భాషలో ఆవేదనను వెళ్లగక్కిండు. రచనారంభంలో తిక్కనతో పాటు సోమన, కాళిదాసులను పొగిడిండు.

మనుషులందరూ గంజి మెతుకులు, తిండి కోసమే ఇన్ని తిప్పలు పడుతున్నారని చెప్పిండు. కుల, మతాల వివక్ష, ఆర్యసమాజంలోని డొల్ల తనాన్ని, వేశ్యా లంపటత్వాన్ని, కుకవులు, చదువు విలువ, కష్ట సుఖాలను ఎదుర్కోవడం, సోమరులు, తల్లి దండ్రుల పట్ల గౌరవం, భార్య భర్తల మధ్య ఉండాల్సిన అన్యోన్యత, సత్యం యొక్క ప్రాధాన్యత, దొంగ గురువులు, చెడ్డ శిష్యులు, అక్షరం విలువ, సోమరులు, దొంగలు, వేశ్యలు, సినిమాలు, హోటల్లు తదితరాంశాలను అచల బోధక దృక్పథంతో చెప్పిండు. తాను చెప్పిందే ఆచరించిండు.

పునర్వివాహంని ఆహ్వానిస్తూ, దుర్వ్యసనాలను నిరసిస్తూ, కులాల పేర్ల ఆధారంగా వ్యక్తుల నడవడిపై తీర్పు ఇవ్వొద్దని, తీర్థ యాత్ర ప్రదేశాలను బట్టి మనుషుల గుణగణాలను నిర్ణయించకూడదని పద్యాలు రాసిండు. అంతేగాదు ధనవంతుల లోభితనాన్ని, భిక్షగాడి దయా గుణాన్ని కూడా ఇందులో చెప్పిండు. ఈ కృతి ద్వారా 100 ఏండ్ల కిందటి తెలంగాణ సమాజాన్ని అక్షరాలద్దంలో మనముందుంచినాడు. చదువుని మించిన సంపద లేదని చెప్పిండు. రాజు బుద్ధిమంతుడైతే ప్రజలు బాగుంటారని రాజకీయాంశాలను సైతం తన శతకములో వక్కాణించిండు.

ఈ పద్యాలన్నీ తెలంగాణకే ప్రత్యేకమైన ఉర్దూ తెలుగుఇంగ్లీషు మిశ్రిత భాషలో రాసిండు. బుట్టచోరు, తూట్ల బొంత, బుదుగరించుట, నాలిముచ్చు, ముస్తాజరు, బద్మాషి, పెనిమిటి, మిండడు, ధగిడి కొడుకు, మొకద్దము, సర్టిఫికెటు, సిగరెటు, హోటల్, రింగులు, తుట్టి, బడబడొర్లు, లతుకోరు, చిరుబుర్రులు ఇట్లా అనేక పదాలను ఈ పద్యాల్లో సరిగ్గా ఇమిడే విధంగా చెప్పిండు.

అచల గురువులు తాము చెప్పదలుచుకున్న విషయం శిష్యులకు సూటిగా అర్థమయితుందా లేదా అనే దాని మీదనే దృష్టి పెడతారు. అందుకే ఇందులో భక్తుల కండ్లు తెరిపించేందుకు ఇప్పుడు బూతుగా భావిస్తున్న పదాలను సైతం యథేచ్ఛగా విఠల్ వాడిండు. ఇప్పటి కాలంలో అది తప్పుకానీ అప్పుడవి అంగీకారమైన పదాలే. ఈ దృష్టితో చూసినట్లయితే బూర్ల విఠల్ తెలుగు సమాజానికి చేసిన హితబోధ ఈజీగా అర్థమయితుంది. ప్రజల జీవన సరళిని గమనించి వారిని సన్మార్గంలో నడిపించేందుకు అక్షరాల చికిత్స చేసిండు. కటువుగానే అయినా నిక్కచ్చి వాస్తవాలను చిత్రించిండు. చేదు మాత్రలతో మనుషుల అపసవ్య ఆలోచనల రోగం కుదిర్చే పనిసిండు. ఇంతటి ఘనమైన జ్ఞానభోధకు సంబంధించిన శతకాలు నాలుగు అచ్చయినప్పటికీ అందులో ఒక్కటి మాత్రమే లభ్యంగా ఉన్నది. ఈ ఒక్కటి కూడా 1937 తర్వాత మళ్ళీ ముద్రణ పొందినట్టూ కనిపించడం లేదు. పండితులకు, అకడెమిషియన్స్, పరిశోధకులకు, సాహిత్యాభిమానులకు అందుబాటులో ఉండే విధంగా ఈ పుస్తకం పునర్ముద్రణ జరగాల్సిన అవసరమున్నది. అందుకోసం ఈ శతకంలోని కొన్ని పద్యాలు ఇప్పుడిక్కడ ఇస్తున్నాను.

సీ. శ్రీ వైశ్యకుల రత్న సిరులు సంపత్కరుల్
వినరయ్య నామాట వీనులారా
మనబిడ్డ లందరు మధ్యమిమౌదాక
పెండ్లి ప్రయత్నముల్ ప్రేమ వలదు
బదునైదు సంవత్సరంబులు బడు నటు మీద
యీడు సరి పురుషులను జూడవలయు
బుద్ధిమంతుడు గొప్ప విద్యరాకున్నను
యుక్తిచె బ్రతికెడి యుత్తములకు
గీ. యివ్వవలెగాని మనము యూహించి చూడ
యెవ్వరయిన యేకులం బెచట నైన
సకల జనులెల్ల వినదగు శుభ మటంచు
దెలిపినాడను మీరంత దెలియు కొరకు
చం. పతులు గతించినంక కుల భామినులెల్లరు
బ్రతుకు వ్యర్థమా
మతమును మీరి దుర్గతికి మిండలగోరుచు
నుందురందరున్
సుతులును గల్గుచున్న తరి చూడగ బొందలొ
ద్రొక్కు చుందురో
హితులగు గన్న కూతురుల యివ్వరె పెండ్లికి
యింపలర్పగన్
సీ. మన బిడ్డలకు పెండ్లి మరల జేతమటంచు
దలువరే మా తల్లి దండ్రులార
మన సోదరీ మణుల మమత జెన్నొందగ
అనయమిది గూర్పరే యన్నలార
మరుదండ్లకును పెండ్లి మళ్ళి గావింతుమని
భావించి చూడరే బావలార
మనమనమరాండ్లకు మరల పెండ్లి యటంచు
తగునని బూనరే తాతలార
కోడండ్లకును పెండ్లి కోరి జేతమటంచు
మానబోకుండి వో మామలార

అంటూ పునర్వివాహ ప్రాధాన్యత గురించి హితవు చెప్పిండు.

ఆనాటి సామాజిక స్థితికి అద్దం పట్టేలా ఇట్లా చెప్పిండు. ఇట్లాంటి హితబోధ చేసిన కవి మిగతా ఏభాషలో ఉన్నా ఆయన్ని పూజించి గౌరవించేవారు. కానీ తెలుగువారి దౌర్భాగ్యం వల్ల వేమన్నకు సాటి అయినటువంటి కవి మనకు తెలియకుండా పోయిండు. ఇప్పటికైనా ఆయన రచనలు పునర్ముద్రించాలి. ఇందుకు సాహిత్య అకాడెమీ లాంటి సంస్థలు ముందుకు రావాలి.

---

## చావు మాఫీ??

ఎన్ని మాఫీలు ఉండి ఏం లాభం
అనుభవించడానికి
ఎప్పటికీ బతికి ఉండాలి కదా!
చావు మాఫీ అయితే బాగుండు !
ఎప్పటికీ చావక
బతికి ఉండుడే ఉండుడు!



-కందాళై రాఘవాచార్య
8790593638





## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.

43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# పాకిస్థాన్‌పై ట్రంప్ పొగడ్తలు

## క్రెడిట్ ఇవ్వనందుకు భారత్ పై సెటైర్లు.. యుద్ధం ఆపింది తానేనంటూ మరోసారి బడాయి ముచ్చట్లు



**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పాకిస్తాన్‌పై పొగడ్తలు గుప్పించారు. పాక్‌లో బలమైన నాయకత్వం ఉందన్న ఆయన.. ఈ విషయాన్ని కొందరు అంగీకరించరంటూ భారత్‌ను ఉద్దేశించిన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భారత్ పాకిస్తాన్ ఉద్రిక్తతలను సద్దుమణిగేలా చేసింది తానేనని, ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనని ట్రంప్ గొప్పలు చెప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో ఎవరి పాత్ర లేదని భారత్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. అయినా.. ట్రంప్.. యుద్ధం ఆపింది తానేనని చెప్పుకుంటున్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి పాకిస్తాన్‌లో నాయకత్వం బలంగా ఉందన్నారు.. యుద్ధాన్ని ఆపినందుకు తనకు భారత్ గుర్తింపు ఇవ్వడం లేదని ఫ్రస్టేషన్ వ్యక్తం చేశారు. ట్రంప్ మాట్లాడుతూ "పాకిస్తాన్‌కు చాలా బలమైన నాయకత్వం ఉంది. నేను ఇది చెప్పడం కొంతమందికి నచ్చదు. కానీ ఇది నిజం. వారు(భారత్‌పాక్) ఆ యుద్ధాన్ని ఆపేశారు. నేను వారి గురించి చాలా గర్వపడుతున్నాను. అయితే నాకు గుర్తింపు లభించిందా? లేదు. వారు నాకు దేనికీ గుర్తింపు ఇవ్వరు." అన్నారు. అయితే ట్రంప్ భారత్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, మే 10న జరిగిన కాల్పుల విరమణ గురించి మాట్లాడారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ సైనిక చర్య చేపట్టిన క్రమంలో, పాకిస్తాన్ తన శాంతి విజ్ఞప్తికి స్పందించిందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ భారత్ మాత్రం తన ప్రయత్నాలను గుర్తించలేదన్నారు. ఈ విషయంలో విదేశీ మధ్యవర్తిత్వం లేదని భారత్ చెబుతూనే ఉంది. ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని.. ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి ఏకపక్షంగానే కాల్పుల విరమణ జరిగిందని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ విషయంలో పాకిస్థాన్ కుటిల బుద్ధిని ప్రపంచవేదికపై ఎండగట్టేందుకు దౌత్య పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. ఈ విషయంపై భారత్ వైఖరిని చెబుతూనే ఉన్నారు. "ఉద్రిక్తతలను కొనసాగించడంలో భారత్‌కు ఆసక్తి లేదని మేము మొదటి నుంచి స్పష్టంగా చెబుతూనే ఉన్నాము. ఉగ్రవాదుల రెచ్చగొట్టే చర్యలకు ప్రతిస్పందనగానే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. కాల్పుల విరమణలో ఇందులో ఎవరి ప్రమేయం లేదు" అని స్పష్టం చేశారు.

# ఖమ్మం- పెద్దపల్లి ఎక్స్ ప్రెస్

## రెండు పార్లమెంట్ లకే ఆరు పదవులు.. కేబినెట్ లో హవా

### అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కేబినెట్ లో దళిత సామాజికవర్గానికి పెద్దపీఠ లభించగా, ఇది ఖమ్మంపెద్దపల్లి ఎక్స్ ప్రెస్ గా ఉందని పలువురు నేతలు చమత్కరిస్తున్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో పక్కపక్క నియోజకవర్గాలకే తొలివిడతలో మూడుమంత్రిపదవులు ఇవ్వగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇందులో ఉన్నారు. ఇపుడు రెండో విడతలో మూడే పదవులు భర్తీచేయగా అందులో రెండు పెద్దపల్లి పార్లమెంట్ కే దక్కడం సంచలనంగా మారింది. ఈ రెండు పదవులు కూడా ఎస్సీ రిజర్వుడు కేటగిరీకే దక్కడం మరో విశేషం. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ మంత్రులుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే పెద్దపల్లి పార్లమెంట్ నుండి సీనియర్ నేత శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్నారు. దీంతో ఖమ్మం, పెద్దపల్లి పార్లమెంట్ లకు తీన్మార్ దక్కినట్లయింది. ఈ రెండు పార్లమెంట్ లలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయగా, అధికారం దక్కడంలో కీలకపాత్ర పోషించినందున ప్రాధాన్యం దక్కడం సబబేనంటూ మరికొందరు విశ్లేషిస్తున్నారు.


**ఉప ఎన్నిక తర్వాతే హైదరాబాద్ కోటా**

ఉప ఎన్నిక తర్వాతే హైదరాబాద్ కోటా స్థానం భర్తీ కానుంది. స్థానిక ఎన్నికలు, జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక తర్వాత మరో విడత విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. మిగిలిన స్థానాల్లో రెడ్లతో పాటు మైనారిటీకి ఒక స్థానం దక్కే అవకాశాలున్నాయి.

# మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...
# రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికరవ్యాఖ్యలు

- జాతీయ రాజకీయాల్లో వాజ్ పేయి.. తెలంగాణలో దత్తాత్రేయ
- పదవి ఉన్నా లేకున్నా దత్తన్నపై గౌరవం తగ్గదు
- హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ
- కన్నులపండువగా కార్యక్రమం
- పుస్తకాన్ని ఆవిష్కరించిన ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ రాష్ట్రపతి కోవింద్, వెంకయ్యనాయుడు
- కార్యక్రమంలో గవర్నర్లు, కేంద్ర, రాష్ట్రమంత్రులు, ప్రముఖులు



**హైదరాబాద్, మహా :** పదవి ఉన్నా లేకున్నా బండారు దత్తాత్రేయపై ఉన్న గౌరవం ఏ మాత్రం తగ్గదని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయన్ను గౌరవిస్తారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శిల్పకళావేదికలో జరిగిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు చూసినా దత్తాత్రేయ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. ''గౌలిగూడ గల్లి నుంచి హరియాణా గవర్నర్ వరకు ఎదిగారు. సాధారణ ప్రజలతో ఆయనకు మంచి అనుబంధం ఉంది. పేదలు చేసుకునే చిన్న చిన్న వేడుకల్లో ఆయన భాగం అయ్యేవారు. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు ని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు. నాకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఎప్పుడు దాచుకోను. మంత్రివర్గ విస్తరణ ఉన్నా.. ఆ కార్యక్రమం అవ్వగానే దత్తాత్రేయ కోసం ఇక్కడికి వచ్చాను. ఆయన అజాత శత్రువు'' అని సీఎం అన్నారు.

''జాతీయ రాజకీయాల్లో వాజ్‌పేయికి ఉన్న గౌరవం.. రాష్ట్రస్థాయిలో దత్తాత్రేయకు ఉంది. ఆయన నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి. ఆయన శైలి, విధానాల నుంచి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారు నేర్చుకోవాలి. జంటనగరాల్లో కష్టం వస్తే ప్రజలకు గుర్తుకు వచ్చే నాయకులు పీజేఆర్, దత్తాత్రేయ. తిరుపతి దర్శనాలు, రైల్వే రిజర్వేషన్ కోసం మాకు సిఫార్సు లేఖలు ఇచ్చేవారు. మా నిర్ణయాల్లో వారి స్ఫూర్తి ఉంటుంది''అని అన్నారు.

**ప్రజలే నా ఆత్మకథ ఆవిష్కరించిన చంద్రబాబు**

హర్యానా గవర్నర్, సీనియర్ రాజకీయవేత్త బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. దశాబ్దాల ప్రజాజీవితంలో దత్తాత్రేయ సాధించిన విజయాలు, ఆయన వ్యక్తిగత మైలురాళ్లు, సామాజిక సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఈ పుస్తకం కళ్లకు కడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మంత్రులు కూడా చంద్రబాబుతో ఉత్సాహంగా మాట్లాడుతూ కనిపించారు. బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' తెలుగు ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, దత్తాత్రేయ నిబద్ధత, నిరాడంబరత, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ పుస్తకం భావి తరాల నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన జీవితంలోని ఒడిదొడుకులు, విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. సీనియర్ ప్రజా సేవకుల జీవితానుభవాలను గ్రంథస్థం చేయడం సమాజానికి ఎంతో అవసరమని, వారి కథనాలు మార్గదీపికలుగా ఉపయోగపడతాయని చంద్రబాబు అన్నారు.

**సామాన్యజీవితం నుండి**

తన ఆత్మకథ గురించి గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, ఇది తన సామాన్య జీవితం నుండి అత్యున్నత రాజ్యాంగ పదవుల వరకు సాగిన ప్రయాణానికి హృద్యమైన కథనమని తెలిపారు. తన తల్లి దివంగత ఈశ్వరమ్మ తనకు నేర్పిన సానుభూతి, అంకితభావం, సేవా విలువలే తన జీవితాన్ని, వృత్తిని తీర్చిదిద్దాయని ఆయన గుర్తుచేసుకున్నారు. తన జీవిత కథ యువతను నిబద్ధతతో, వినయంతో ప్రజా సేవ వైపు నడిపించాలని ఆశిస్తున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తెలుగు సాహిత్యం, ప్రజా జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని, దక్షిణ భారత దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులలో ఒకరి వ్యక్తిగత, రాజకీయ ప్రస్థానాన్ని పాఠకులకు అందిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవలి విషాద సంఘటనల బాధితులకు నివాళులు అర్పించిన ప్రముఖులు, క్లిష్ట సమయాల్లో ఐక్యతను, స్థితిస్థాపకతను పెంపొందించడంలో నాయకత్వ పాత్రను నొక్కిచెప్పారు.

# చెవులున్నా వినపడవు
# నోరుంది ఖానీ చెప్పరు

## కిషన్ రెడ్డి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజా సింగ్ పరోక్ష విమర్శలు



**మహా :** కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి పరోక్ష విమర్శలు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకరిస్తే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ పరోక్ష విమర్శలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డి సహాయం అడుగుతున్న వారికి చెవులు ఉన్నా వినపడవని అన్నారు. నోరు ఉంది కానీ చెప్పరంటూ రాజా సింగ్ ఎద్దేవా చేశారు. అలాంటి మహానుభావులను అడిగితే ఏం సహాయం చేస్తారని ఎమ్మెల్యే రాజాసింగ్ పరోక్షంగా విమర్శించారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య కొంత కాలంగా కోల్డ్ వార్ జరుగుతోంది. దీనిపై బీజేపీలో అంతర్గతంగా జోరుగా చర్చ నడుస్తోంది. దీనిపై పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విలేకర్లు ప్రశ్నించినా.. అలాంటివి పార్టీలో ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సముదాయించిన విషయం విదితమే. అనంతరం పలు సందర్భాల్లో సైతం కిషన్ రెడ్డిని రాజా సింగ్ పరోక్షంగా విమర్శించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇంకోవైపు ఎమ్మెల్యే రాజాసింగ్ వైఖరిపై పార్టీ అగ్రనాయకత్వం గుర్రగా ఉన్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా ఇటీవల ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నాలు సైతం జరిగాయి. ఆ క్రమంలో రాష్ట్ర నాయకత్వంతో కేంద్రంలోని పార్టీ అగ్రనాయకత్వం చర్చలు జరిపింది. కానీ ఎందుకో.. మళ్లీ అగ్రనాయకత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

# చారిత్రక కాచిగూడ రైల్వేస్టేషన్ కు లైటింగ్ సొబగులు

### ఈనెల 9న ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### రూ. 2.23 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ

**మహా :** ఎంతో చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న కాచిగూడ రైల్వే స్టేషన్ కు రూ.2.23 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఈ నెల 9 న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. నిజాంల ఏలుబడిలో 1916 లో "గోతిక్ శైలి"లో కాచిగూడ రైల్వే స్టేషన్ నిర్మాణం జరుపుకుంది. కాచిగూడ రైల్వే స్టేషన్ కు ఉన్న ఈ చారిత్రక నేపథ్యాన్ని, అద్భుతమైన నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించడానికి మొత్తం 785 ఇల్యుమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ఈ ఇల్యుమినేషన్ లైట్ల వెలుగులో కాచిగూడ రైల్వే స్టేషన్ బిల్డింగ్ ఎంతో చూడముచ్చటగా కనిపించనుంది. నగరం మధ్యలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. ఫసాడ్ లైటింగ్ వ్యవస్థ ద్వారా వీరందరికీ కాచిగూడ రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత తెలియయనుంది. కాచిగూడ రైల్వే స్టేషన్ చారిత్రక నేపథ్యం కలిగి ఉండటమే కాకుండా గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకుంటూ పర్యావరణ పరిరక్షణలో కూడా తనవంతు పాత్రను పోషిస్తోంది. గ్రీన్ రైల్వే స్టేషన్లకు రేటింగ్ ఇచ్చే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్ కు ప్లాటినం రేటింగ్ ఇవ్వబడింది. అంతే కాకుండా, భారతీయ రైల్వేలలో ఎనర్జీ ఎఫిషియంట్ స్టేషన్ గా కాచిగూడ రైల్వే స్టేషన్ నిలిచింది. భారతీయ రైల్వేలలో మొట్టమొదటి డిజిటల్ పేమెంట్ సేవలను కాచిగూడ రైల్వే స్టేషన్ లోనే ప్రారంభించారు. ఇలా ఎన్నో రకాలుగా ప్రాముఖ్యతను సంతరించుకున్న కాచిగూడ రైల్వే స్టేషన్ ను రూ.421.66 కోట్లతో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేయనున్నారు.

# నేడు కమిషన్ ముందుకు హరీష్ రావు

## కాళేశ్వరంపై విచారణ

### విచారణపై సర్వత్రా ఉత్కంఠ



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం కమిషన్ ముందు మాజీమంత్రి హరీష్ రావు సోమవారం విచారణకు హాజరుకానున్నారు. ఇప్పటికే ఈటల రాజేందర్ జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వగా, హరీష్ విచారణపై ఉత్కంఠ నెలకొంది. విచారణకు హాజరువుతానని, కాళేశ్వరం కమిషన్ ముందు బాంబు పేలుస్తానని హరీష్ రావు సంచలన ప్రకటన చేశారు. దీనిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా ఇచ్చి తాము తప్పుచేయలేదని చెప్పే ప్రయత్నం చేశారు.

# ఏడాది చివరిలో
# కొత్త ఎయిర్ పోర్టులకు టెండర్లు

## 2027 నాటికల్లా అందుబాటులోకి

### పర్యాటక రంగానికి మరింత ఊపు



**మహా :** తెలంగాణ రాష్ట్రం వైమానిక రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు వరంగల్ శివారులోని మామునూరు, ఆదిలాబాద్ శివారులోని శాంతినగర్‌లో రెండు కీలక విమానాశ్రయాలు 2027 చివరికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మహత్తర ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన టెండర్లను ఈ ఏడాది చివరిలో ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం శంషాబాద్ విమానాశ్రయం మాత్రమే అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ రెండు కొత్త ఎయిర్‌పోర్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్య కార్యకలాపాలకు, పర్యాటక రంగానికి గణనీయమైన ఊపునివ్వనున్నాయి.

వరంగల్‌లోని మామునూరు ప్రాంతానికి ఒక సుదీర్ఘ వైమానిక చరిత్ర ఉంది. నిజాం కాలంలో 1930లోనే నిర్మించబడిన ఈ విమానాశ్రయం 1981 వరకు సేవలందించింది. దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 జూలై 31న రాష్ట్ర మంత్రివర్గం ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీనిని బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పచ్చజెండా ఊపింది. విమానాశ్రయం పరిధిలో ఇప్పటికే 696 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, విస్తరణకు అవసరమైన అదనపు 253 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.205 కోట్లను కేటాయించి, పనులను వేగవంతం చేస్తోంది. విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్), డిజైన్లను సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి లేఖ రాసింది. ఉడాన్ పథకం కింద ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించడం, దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణతో పాటు, దక్షిణ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయి.

**ఆదిలాబాద్ విమానాశ్రయం.. దశాబ్దాల కల సాకారం**

ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కల కూడా చాలా కాలంగా ఉంది. స్వాతంత్రానికి ముందే, 1930లో, నిజాం కాలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం అవసరమని స్థానికులు దీర్ఘకాలంగా కోరుతున్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు భారత వాయుసేన (ఐఏఎఫ్) నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించిందని ఇటీవల రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానాలు, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించింది. ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలో ఉన్న 369 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తే.. ఇప్పట్లో అదనపు భూసేకరణ అవసరం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు విమానాశ్రయాల నిర్మాణానికి ఒక్కోదానికి సుమారు రూ.500 నుంచి రూ.600 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో 80 శాతం ఖర్చును కేంద్రం, 20 శాతం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి.

ఈ విమానాశ్రయాల ఏర్పాటుతో తెలంగాణలో ప్రయాణ సమయం తగ్గుతుంది. ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. స్థానికులకు కొత్త ఉద్యోగావకాశాలు లభించి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి. అంతే కాకుండా.. ఈ రెండు విమానాశ్రయాల సరిహద్దులోని ప్రాంతాల్లో భూములకు అధిక ధర పలుకుతాయి.


### కొత్తమంత్రులకు శాఖలపై
# ఉత్కంఠ

- వివేక్ కు కార్మిక లేదా యువజన సర్వీసులు?
- శ్రీహరికి పశుసంవర్ధకం? అడ్లూరికి సాంఘీకసంక్షేమం?

**హైదరాబాద్, మహా:** కొత్త మంత్రులకు శాఖలపై ఉత్కంఠ నెలకొంది. తమకు ఏ శాఖలు ఇచ్చినా.. సమర్ధవంతంగా న్యాయం చేస్తామని ఇప్పటికే ఆ ముగ్గురు మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారు. సీఎం వద్ద ఉన్న విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హోం తదితర శాఖల్లో నుంచి కొన్ని తీసి, కొత్త మంత్రులకు కేటాయిస్తారా? లేదా రెండు మూడు శాఖలు కలిగిన పాత మంత్రుల నుంచి కొన్ని తొలగించి కొత్త వాళ్లకు అటాచ్ చేస్తారా? అనేది తెలియాల్సి ఉన్నది. ప్రభుత్వం నుంచి ఆదివారం రాత్రి వరకు శాఖలపై క్లారిటీ ఇవ్వలేదు. తమ సార్ కు ఏం శాఖలు ఇస్తున్నారు? అంటూ గాంధీభవన్, సచివాలయ వర్గాల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే తొలి దశ మంత్రి వర్గ కూర్పు సమయంలో శాఖల కేటాయింపు అంశంలో హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు హైకమాండ్ అనుమతితో సీఎం రేవంత్ రెడ్డి శాఖలను డిసైడ్ చేయనున్నారు.


**కొత్త మంత్రుల శాఖలు ఇవే?**

గడ్డం వివేక్ కు కార్మిక లేదా క్రీడాయువజనసర్వీసులు కేటాయిస్తారన్న ప్రచారం పార్టీలో ఉన్నది. సెక్రటేరియట్ లో గ్రౌండ్ ఫ్లోర్ లో ఛాంబర్ ఇవ్వనున్నట్లు ఆయన సన్నిహితులు చెప్తున్నారు. ఇక అడ్లూరి లక్ష్మణ్ కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖను కేటాయించనున్నట్లు ప్రచారం ఉన్నది. సెక్రటేరియట్ లోని మూడో ఫ్లోర్ లో ఆయనకు ఛాంబర్ ఇస్తారని చర్చ ఉన్నది. వాకిటి శ్రీహరికి క్రీడలు, యువజన, న్యాయ శాఖలు లేదా పశుసంర్ధకశాఖ ఇస్తారని పార్టీలో ప్రచారం ఉన్నది. ఈయనకు సచివాలయంలో ఫోర్త్ ఫ్లోర్ లో ఛాంబర్ ఇస్తారని ఆయన అనుచరులు వివరించారు.



## కళ్యాణ వేడుకలో కంది శ్రీనన్న

**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి పలు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని గాయత్రీ గార్డెన్ లో ఆదివారం జరిగిన ఓసావార్ రోజా శ్రీనివాస్ వివాహ వే దుకలో పాల్గొన్నారు. నూతన వధూ వరులకు కంది శ్రీనన్న పెళ్లి కనుక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అయన వెంట పలువురు నాయకులు ఉన్నారు



## నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** బేల మండలం అవల్పూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ మినుకు సుధాం రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం గ్రామానికి వెళ్లిన ఆయన వేడుకలో పాల్గొని కంది శ్రీనన్న కానుకను బహుకరించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## జాణంపేటలో భవాని మాత ఆలయ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం

**షాద్ నగర్, మహా:** ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి చల్లని చూపు ఆశీస్సులు సకల జనులపై ఎల్లపుడు ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి. షాద్ నగర్ పట్టణంలోని 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహా ఆధ్వర్యంలో భవానిమాత ఆలయ మరియు విగ్రహా పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.ఆలయ మరియు విగ్రహా పునః ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ నాయకులు కానుగ అనంతయ్య, (చిన్న) యాదగిరి,యుగేందర్,దినేష్‌సాగర్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్,శివ,మధు,శివ చారి,సుధీర్,గుట్ట రాజు ,పిఎన్ గౌడ్, అన్వారీ రాజు,తదితరులు పాల్గొన్నారు..

# హాయ్ హాయ్ నాయకా... పై వంతెన వస్తోందిక..

## రూ. 100 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం

### షాద్ నగర్ బైపాస్ జాతీయ రహదారిపై పైవంతెనల నిర్మాణానికి సర్వే..

### షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" కృషితో ఆచరణలోకి..

### షాద్ నగర్ వద్ద రహదారిపై ముమ్మరంగా సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు

### కొత్తూరు నుంచి బూర్గుల వరకు పైవంతెనల నిర్మాణం..

**షాద్ నగర్, మహా:** రోడ్డు ప్రమాదాలు.. ఎందరో అమ్మలకు తమ బిడ్డలను దూరం చేశాయి.. మరెందరో ఆడపడుచులను వితంతువులుగా మార్చాయి.. నూరేళ్ల జీవితానికి క్షణకాలంలో ముగింపు పలికాయి.. నిమిషాల వ్యవధిలో ఇంటికి చేరాల్సిన వ్యక్తులు సెకండ్ల వ్యవధిలో మృత్యుఒడికి చేరిన సంఘటనలు ఎన్నెన్నో.. అలాంటి విషాదాలకు ఇక తెరదించాలన్న సంకల్పంతో షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ "వీర్లపల్లి" శంకర్ ఒక ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.. నియోజకవర్గ పరిధిలోని మూడు వంతెనల కోసం దాదాపు 100 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించి ఈ మూడు వంతులను పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఒక్కో వంతెనకు దాదాపు 35 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. వీటికి టెండర్లు కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం బాలనగర్ వద్ద పనులు నడుస్తున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇక్కడ పనులు ప్రారంభం కాబోతున్నాయి. కేశంపేట వెళ్లే బైపాస్ జాతీయ రహదారి పై సర్వేకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం దానికి ఆకారం తెచ్చారు.. అవే నియోజకవర్గ పరిధిలో ఉన్న బైపాస్ జాతీయ రహదారిపై కీలకమైన ప్రమాద మలుపుల వద్ద పైవంతనలు. కొత్తూరు నుంచి మొదలుపెట్టి షాద్ నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ రోడ్డు కూడలి వరకు ఈ వంతెనలు ఏర్పాటు కానున్నాయి.



వీటితోపాటు మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోకి వచ్చే బాలానగర్, రాజాపూర్ మండలాలలోనూ రెండు వంతెనలు ఏర్పాటు అవుతున్నాయి. ఒక్కసారి ఈ వంతెనల అవసరం, ఆవశ్యకత, ఆచరణల గురించి చెప్పుకుంటే..

**అవసరం ఇలా..**

కొత్తూరు నుంచి షాద్ నగర్ శివారు అన్నారం గేట్ వరకు 44వ నెంబర్ జాతీయ రహదారి బైపాస్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాంతాలలో అత్యంత వేగంగా ప్రయాణించే వాహనాల దాటికి పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన కారణంగా గతంలో వందల సంఖ్యలో జనం తమ ప్రాణాలను కోల్పోయారు. వీరిలో ద్విచక్ర వాహనదారులతో పాటు సమీపతాండాల నుంచి వివిధ పనుల నిమిత్తం వెళ్లే పాదాచారులు ఎక్కువగా ఉన్నారు. ప్రమాదాల కారణంగా వీరు తమ ప్రాణాలను కోల్పోవడంతో కుటుంబాలు రోడ్డున పడ్డ సందర్భాలు ఎన్నో. ఇప్పటివరకు కూడా కొత్తూరు, నందిగామ, షాద్ నగర్ పట్టణం పరిధిలోని కమ్మదనం కూడళ్లలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఇక్కడ పైవంతనాలు ఏర్పాటు చేయాలనే సంకల్పం ఎప్పటినుంచో ఉంది. కానీ ఎంతో కాలంగా అది కేవలం కలగానే మిగిలింది. గతంలో వీటిపై ఎన్నో వార్తలు మీడియా ద్వారా వెలుగుచూసిన గత ప్రభుత్వాలు స్పందించలేదు. ఇక వర్తమానం లోకి వస్తే..

**ఇదీ ఆచరణ..**

ఇక్కడ పైవంతెనల ఏర్పాటు ఆవశ్యకత గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వంతెనల ఏర్పాటుకు కృషి చేస్తానని తొలి దశలోనే హామీ ఇచ్చారు. హామీ ఇవ్వడమే కాకుండా సంబంధిత మంత్రులను, అధికారులను కలిసి ప్రతిపాదనలు ఇచ్చి మంజూరు చేయించారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలో మొత్తం 3 వంతెనలు మంజూరయ్యాయి. నందిగామజేపీ దర్గాల మధ్యన ఒక వంతెన. అదేవిధంగా కేశంపేట రోడ్డుచటాన్ పల్లి మధ్యన మరో వంతెన, రాయికల్‌బూర్గుల గ్రామాల మధ్య ఇంకో వంతెన ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఆదివారం సర్వే కార్యక్రమాలు నిర్వహించి మార్కింగులు వేశారు. దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా అవసరమైన అత్యవసరమైన పరిస్థితులను గుర్తించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఇప్పటికే వెల్లడించారు. వీలైనంత త్వరగా వీటిని నిర్మాణం చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను నివారిస్తామని పేర్కొన్నారు. సాధ్యమైనంత తొందరగా ఈ వంతెన నిర్మాణాలను పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో ఎమ్మెల్యే శంకర్ ఉన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** బేల మండల్ సిర్సన్న గ్రామంలో ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన కన్ పెల్లి చిన్న వెంకన్న కుటుంబాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

## కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న అందెల శ్రీ రాములు

**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం,బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని మామిడిపల్లి గ్రామం లో ఈరోజు శ్రీశ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ యొక్క మహోత్సవానికి బీజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై మల్లన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులందరూ కలిసి అందెల శ్రీరాములు ని ఘనంగా స్వాగతించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు మన సమాజానికి పునాది లాంటివి అని, ఇలాంటి పవిత్ర కార్యక్రమం లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం,మన ప్రాంత ప్రజలందరి పై మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్ రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మద్ది సబితా రాజశేఖర్



రెడ్డి, యాతం పవన్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ కార్పొరేషన్ ఓబిసి మోర్చా అధ్యక్షులు పెరమోని నరేష్ యాదవ్, కొత్తగూడ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, పెద్ద గొల్ల శంకరయ్య యాదవ్, ఎలగపల్లి యాదగిరి యాదవ్, బండారి గోపాల్ యాదవ్, యాతం మహేందర్ యాదవ్, కడారి మహేందర్ యాదవ్, చిలుకూరు చంద్రయ్య యాదవ్, శంకర్ యాదవ్, మల్లేష్ యాదవ్, పెరమోని నరేష్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, శ్రీశైలం యాదవ్, గురూజని గణేష్ గౌడ్, అశోక్ ముదిరాజ్, నరేందర్ యాదవ్, సాయిరాం, సందీప్, యాదగిరి, శ్రీహరి మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కు నివాళి

**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచనల మేరకు షాద్ నగర్ ముఖ్య కూడలిలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలియజేస్తూ వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన షాద్ నగర్ బీఆర్ఎస్ శ్రేణులు... ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కవిత నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మణ్ నాయక్, వీరేశం, శ్రీనివాస్ రెడ్డి, చిన్న యాదగిరి, రాఘవేందర్, శరత్ కృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు..

## అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

**భూపాలపల్లి, మహా :** అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం ఉదయం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పత్రాలను అందజేశారు. అనంతరం దామరంచపల్లి గ్రామంలో నరేగా నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన బాగుంటుందన్నారు. గుడిసెలో



ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పేద, నిరుపేదలకు మొదటి విడతలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎస్ కె ఎన్ ఆర్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ

**జగిత్యాల ,మహా:** పట్టణంలోని శ్రీ కాసుగంటి నారాయణరావు డిగ్రీ కళాశాలలో 1997 2000 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన బీకాం విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను కళాశాల సిబ్బందిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే 25 సంవత్సరాల క్రితం విద్యార్థులుగా కళాశాలలో ఆటపాటల తో నెమరు వేసుకున్నారు. అంతకుముందు అప్పుడు విద్యను అందించిన అధ్యాపకులను, సిబ్బందికి చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాయికల్ మాజీ మున్సిపాలిటీ చైర్మన్ మోర హనుమండ్లు, అధ్యాపకులు చెన్నమనేని రాజేశ్వరరావు, చెన్న గణేష్,లక్ష్మణ్, నరేందర్, డాక్టర్ అర్వపల్లి రాజేశ్వర్ అవారి శంకరయ్య లతో పాటు ఉద్యోగ వ్యాపార విద్య వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ అప్పటి విద్యార్థులందరూ పాల్గొన్నారు.

## పై వంతెనలకు శ్రీకారం క్షేమదాయకం

### కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** జాతీయ రహదారిపై పైవంతెనల నిర్మాణంతో గ్రామీణుల ప్రయాణానికి ఎంతో క్షేమకరమని దీనికోసం కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలని కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి పేర్కొన్నారు. షాద్ నగర్ బైపాస్ కొత్తూరు నుంచి బూర్గుల వరకు జాతీయ రహదారిపై 100 కోట్లకు పైగా వ్యయంతో పై వంతెనల నిర్మాణానికి కృషిచేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇట్టి పై వంతెనలు ఎంతో ఉపయోగపడతాయనీ కేశంపేట్, కొత్తూర్, ఫరూక్ నగర్ మండలాలకు సంబంధించిన ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుందని, అదేవిధంగా బెంగుళూరు హైవే పై రాకపోకలు కొనసాగిస్తున్న



సుదూర ప్రాంతాల ప్రయాణికులకు కూడా ఇది ఎంతో క్షేమకరమని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు విశాల.




## తెలంగాణ నూతన మంత్రుల నియామక ఎంపిక అభినందనీయం

**జగిత్యాల ,మహా :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేసి, బీసీ ఎస్సీ సామాజిక వర్గాలను గుర్తించి అత్యంత ప్రాధాన్యత కల్పించిన కాంగ్రెస్ అధిష్టానా నికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసి పట్ల లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన మంత్రులుగా నియామకమైన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసి పట్ల లక్ష్మీనారా యణ, బి.సి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా (న్యాయవాది), బిసి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, బిసి సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్ కుమార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎలుక భగవాన్ యాదవ్, బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల సంజయ్ సామ్రాట్, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల వంశీ, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, మేరు కుల సంఘం అధ్యక్షుడు రాపర్తి వినోద్, యూత్ కోఆర్డినేటర్ హృషికేష్, బండపెల్లి నర్సయ్య, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కపిల్ విద్యా వారధి అర్హత పరీక్షకు హాజరైన 226 మంది విద్యార్థులు

**కరీంనగర్, మహా;** పదవ తరగతి లో 470 సాధించిన విద్యార్థులు , నిరుపేద , తల్లిదండ్రులు లేని విద్యార్థుల పై చదువుల నిమిత్తం సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్, కపిల్ విద్య వారధి ద్వారా ఆర్థిక చేయూత నివ్వాలనే సంకల్పంతో అర్హత కలిగిన విద్యార్థుల కోసం ఆదివారం రోజున కరీంనగర్లో నిర్వహించిన అర్హత పరీక్ష కు 226 మంది విద్యార్థిని , విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యంగా అర్హత పరీక్ష లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని , ఎంపికైన వారు ఏ కోర్సు చేసిన, జీవితంలో వారికి నచ్చిన ఏ వృత్తిలో నైనా స్థిరపడే వరకు సంస్థ ద్వారా ఆర్థిక సహాయం



చేస్తుందని సంక్షేమ ట్రస్ట్ చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు.

## నేటి ప్రజావాణి రద్దు

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (09.06.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ కోరారు.

## చేవెళ్లలో 16వ సిపిఐ మండల మహా సభలు

**రంగారెడ్డి జిల్లా మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ 16వ మండల మహా సభలను నిర్వహించనుంది. ఈ సందర్భంగా సిపిఐ మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. చేవెళ్లలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు విలేఖరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి హాజరై మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల మండల 16వ మహా సభలు, మంగళవారం 10వ తారీఖున చేవెళ్ల పట్టణ కేంద్రంలోని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహా సభలకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరు అవుతున్నారని, ఈ మహా సభలలో నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని, అదేవిధంగా భవిష్యత్తు పోరాటాల కార్యాచరణ నిర్ణయాలు తీసు



కోవటం జరుగుతుందని, కావున పార్టీ నాయకులు, గ్రామ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు కర్షకులు, పార్టీ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ మండల మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం ప్రబలింగం, కౌన్సిల్ సభ్యులు సుభాన్ రెడ్డి, సుధాకర్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఇన్సబ్, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

### సామాజిక సేవ సంస్థ ఫౌండర్ ఏ శ్రీధర్

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 13వ డివిజన్ ఎల్బీనగర్ అంబేద్కర్ కాలనికి చెందిన మంద క్రాంతి, 20వ డివిజన్ బి.ఎన్.రావ్ కాలనికి చెందిన రేణుకుంట్ల శేఖర్ కుటుంబ పెద్దలైన వీరు ఇటీవల అనారోగ్యంతో ఎంజీఎం ఆసుపత్రిలో మరణించారు. ఈ నిరుపేద కుటుంబాలకు చెందిన వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని గమనించిన సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో 50,50 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు సామాజిక సేవ సంస్థ వ్యవస్థాపకులు ఎలుకపెల్లి శ్రీధర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవసభ్యులు, మొలుగురి సరిత, రేణుకుంట్ల జ్యోతి, రేణుకుంట్ల స్పందన, తదితరులు పాల్గొన్నారు.


## అంగరంగ వైభవంగా భవానీ మాత దేవాలయ ప్రారంభ మహోత్సవం

### ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువనాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్

### హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు

### దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయం

**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ మున్సిపాలిటీ జానంపేటలో శ్రీ భవాని మాత దేవాలయ ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో దేవాలయ ప్రారంభోత్సవాన్ని వైభవంగా ప్రారంభించి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళి కృష్ణ యాదవ్ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతలను పూజించడం, ఆరాధించడం మన హిందూ సంస్కృతి ఆనవాయితీని, కాలనీలలో అత్యంత వైభవంగా దేవాలయ ప్రారంభోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం సంతోషకరమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని ఆరాధించాలని, నేటి తరం యువత హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానిక మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహా, కాలనీవాసులు అంజయ్య యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య



క్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, నాయకులు దేవేందర్ యాదవ్, కొస్గి శ్రీనివాస్, బచ్చలి నరసింహా, కానుగు అనంతయ్య, చింటూ, పిల్లి శేఖర్, నందిగామ శ్రీనివాస్, చెట్ల జంగయ్య, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), గుండు అశోక్, కొండ మల్లేష్, నవీన్ పులిజాల, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, పవన్ సింగ్, బాబ ఘోరీ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# రంగారెడ్డి జిల్లాకు మంత్రి లేనట్టేనా.?

## మంత్రివర్గంలో జిల్లా ఎమ్మెల్యేలకు స్థానం ఉండదా..?

**పక్క జిల్లా ఎమ్మెల్యేలతో మా జిల్లాకు ఎందుకు పోటీ?.. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి.?**

**స్వరాష్ట్రంలోనూ జిల్లాకు అన్యాయమేనా.? జిల్లాకు ఇన్చార్జ్ మంత్రులేన దిక్కు?**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ రంగారెడ్డి జిల్లా హారంల చుట్టుకుని ఉంటుంది. రాష్ట్రానికి కావలసిన నిధులు ఈ జిల్లా నుంచి అధిక మొత్తంలో అందుతాయని తెలుస్తుంది.

**జిల్లా నాయకులు కార్యకర్తలు సహకరిస్తారా...**

రంగారెడ్డి జిల్లాను మాత్రం పక్క జిల్లాల మంత్రులతో ఇన్చార్జిలుగా నియమిస్తూ, ప్రతిసారి జిల్లాకు అన్యాయం జరుగుతుందనేది జగమెరిగిన సత్యం అని తెలుస్తుంది. ఇన్చార్జిలతో కాలం వెళ్లదీస్తూ జిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా వచ్చే ఎన్నికలలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సహకరిస్తారా అనేది ప్రశ్నగా ఏర్పడింది.?

**జిల్లా నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి...**

గత సార్వత్రిక ఎన్నికలలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, గెలిచిన నాటి నుంచి అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తుందని పలుసార్లు ఆయన తెలపడం జరిగింది. మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలపై చిన్న చూపు చూడడం తగదని పలువురు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించి, జిల్లాకు ప్రాతినిధ్యం వహించేలా, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేలా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జాతీయ నాయకులు దృష్టి సారించాలని జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోను కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగిందని, స్వరాష్ట్ర సాధించి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేడు జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వకుండా తస్కారం చేయడం విడ్డూరంగా ఉందని పలువురు అన్నారు.

**మంత్రివర్గంలో రంగారెడ్డి జిల్లాకు స్థానం ఉండదా....**

పక్క జిల్లా ఎమ్మెల్యేలతో పోటీ మా జిల్లాకు ఎందుకు? మంత్రివర్గంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు స్థానం ఉండదా..? జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు లేరా? కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు లేరా? అనే ప్రశ్నలు ప్రజల వద్ద నుంచి తలెత్తుతున్నాయి. మొదటి విడత మంత్రివర్గంలో జిల్లాకు స్థానం దక్కకపోయినా, మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జిల్లాకు మంత్రిని నియమిస్తుందని, జిల్లా ప్రజలు ఆశాభావంతో ఎదురు చూశారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం జిల్లా ప్రజల, నాయకుల, కార్యకర్తల ఆశలను, మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు.

**జిల్లాకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకే మంత్రి పదవి...**

రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాకు తప్పనిసరి స్థానం కల్పించాలి. రంగారెడ్డి జిల్లాకు జిల్లాలోని ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని, జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహకరించాలని, ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకుల నుంచి డిమాండ్ వస్తుంది.

# మేడిగడ్డ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**కాటారం, మహా :** మేడిగడ్డ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మేడిగడ్డ బ్యారేజ్ వద్ద గల్లంతైన యువకుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడిగడ్డ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే పక్కన పెట్టిందని, అక్కడ వరద ప్రవాహం పెరుగుతుందని తెలిసినా కనీస అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అభం శుభం తెలియని ఆరుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా అందించి అన్ని విధాల ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు వద్దకు పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉందని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అక్కడ ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

# కాంగ్రెస్ పాలనపై భగ్గుమన్న గిరిజన సంఘాలు

**దశరథ్ నాయక్ ముందస్తు హౌస్ అరెస్ట్**

**రేవంత్ సర్కార్ ప్రజలకు మాయ మాటలతో మోసం**

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్**





**రంగారెడి జిలా మహా:** లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ను కడ్తాల్ పోలీసులు గిరిజన సమావేశంలో పాల్గొనకుండా ముందస్తు అరెస్టు చేశారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి రాకముందు అనేక మాయ మాటలు చెప్పి గిరిజనులను మోసం చేసిందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ గిరిజనులకు ఇచ్చిన హామీలలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న గిరిజన సమావేశానికి హాజరుకావడానికి వెళుతున్న దశరథ్ నాయక్ ను కడ్తాల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తనను అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమం ఆపి ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన

## బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషి





**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ ఏకశిల నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలి, మౌలాలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన గ్రామ సభలో భాగంగా బడిబాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ బి వి ఎన్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి స్థానిక కార్పోరేటర్ సురేష్ కుమార్ జోషి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ బి.వి.ఎన్ స్వామి మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణత తొంబయి రెండు శాతం సాధించామని చక్కని విశాలమైన తరగతి గదులు, విశాలమైన మైదానం, అపారమైన అనుభవం గల ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో కలిగి ఉన్నారని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థుల కు ట్రిబుల్ ఐటిలో వెయిటెజ్ ఉందని దీనిని తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. రెగ్యులర్గా తమ పిల్లలను పాఠశాలలకు పంపుతూనే తల్లిదండ్రులు పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ సమావేశాల్లో పాల్గొనాలని కోరారు.

# పిఆర్టీయు టిఎస్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, ఎమ్మెల్సీ



**హన్మకొండ మహా;** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన హనుమకొండ వరంగల్ జిల్లా పి ఆర్.టి.యు టిఎస్ భవనం మొదటి అంతస్తును ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఉపాధ్యాయులు నన్ను ఎన్నికల్లో నిబద్ధతతో అండగా నిలిచారని ఈ వేదిక ద్వారా వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ వర్గం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడు నా సహకారం ఉంటుందని తెలిపారు. ఈ భవనం ఉపాధ్యాయ సంఘ సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని భవిష్యత్తులో పి ఆర్.టి.యు టిఎస్ కు సంబంధించిన ఏవైనా అవసరాలుంటే నా దృష్టికి తీసుకు వస్తే పూర్తి స్థాయిలో సహకరిస్తానని స్పష్టం చేశారు. పి ఆర్.టి.యు టిఎస్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో, విద్యారంగ అభివృద్ధికి పాటుపడడంలో ముందుంటూ, ప్రభుత్వానికి మేలైన సలహాదారులుగా పనిచేస్తూ వస్తోందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సంస్థకు ఎమ్మెల్యే నాయిని హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధికారులు, సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్సీ, నగర మేయర్

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని శుభం గార్డెన్స్ లో వైభవంగా జరిగిన 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ కుమారుడు శ్రీకాంత్శ్రీ నవ్య వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తో కలిసి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి హాజరై నూతన వధూవరులకు నూతన వస్త్రాలు బహుకరించి నిండు మనసుతో ఆశీర్వదించారు. వధూవరులను ఆశీర్వదించిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, బిజెపి నాయకులు, వివిధ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, జన్ను వివేక్, వి నాగరాజు, ముఖ్య నాయకులు, ప్రముఖులు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో పేదింటి వారి సొంత ఇంటి కల నెరవేరింది

## లింగంపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పగడాల ప్రవీణ్ కుమార్



**రంగారెడ్డి జిల్లా మహా:** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పేదింటి వారి సొంత ఇంటి కల నెరవేరిందని, లింగంపల్లి గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పగడాల ప్రవీణ్ కుమార్ అన్నారు. మంచాల మండలం, లింగంపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబాలు బూర జ్యోతి జంగయ్య, బూర శేఖర్ జ్యోతిలకు, ఇందిరమ్మ ఇల్ల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు పొందిన లబ్ధిదారులు సంతోషంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో ప్రజా ప్రభుత్వంలో మా కల నెరవేరినందుకు కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నౌసు నరసింహ, మాజీ సర్పంచ్ నూతన గంటి సదానందం, పొదిల వెంకటేష్, బురా కృష్ణ గౌడ్, మంచాల మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంతంగి ప్రశాంత్, పగడాల ప్రభాకర్, పెర్క వినయ్ కుమార్, బూతు అధ్యక్షులు అలీ, భాస్కర్, పంతంగి సుమన్, పాల్గొన్నారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

# శ్రేయస్ అయ్యర్... సారథిగా సూపర్

## మూడు జట్లను ఐపీఎల్ ఫైనల్కు చేర్చిన ఏకైక కెప్టెన్

### బ్యాటింగ్‌లోనూ అసాధారణ ప్రదర్శన

### భవిష్యత్తు భారత సారథిగా మన్ననలు



**ధోనీ మాదిరిగా వ్యూహరచనలో మేటి... కోహ్లి తరహాలో దూకుడులో ఘనాపాటి... రోహిత్‌ను అనుకరిస్తున్నట్లు అనిపించినా... అతడికి అతడే సాటి! 'అతడి చేయి పడితే రాయి కూడా రత్నంలా మెరుస్తుంది'... అన్న రీతిలో దశాబ్ద కాలానికి పైగా 'ప్లే ఆఫ్స్' మొఖం చూడని జట్టును తుదిపోరుకు చేర్చిన ఘనుడతడు! ఐపీఎల్ చరిత్రలో మరే సారథికి సాధ్యం కాని విధంగా మూడు వేర్వేరు జట్లను తుదిపోరుకు తీసుకెళ్లిన మొనగాడతడు! అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ జట్టును నడిపించడంలో నేర్పరి అతడు! మనం ఇంతసేపు చెప్పకున్నది... ఈసారి ఐపీఎల్ ట్రోఫీ గెలవకపోయినా తన నాయకత్వ చతురతతో అందరి మనసులు గెలిచిన పంజాబ్ కింగ్స్ సారథి శ్రేయస్ అయ్యర్ గురించే!!**

ధోనీ, రోహిత్ కూడా కెప్టెన్‌లుగా మూడు కంటే ఎక్కువ ఐపీఎల్ ఫైనల్స్ ఆడినా... ఆ ఇద్దరూ ఒకే జట్టును నడిపించారు. కానీ గత ఐదేళ్లలో అయ్యర్ మూడు వేర్వేరు ఫ్రాంచైజీలకు తుదిపోరు మజా చూపాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు ఆడిన ఏకైక ఫైనల్ శ్రేయస్ సారథ్యంలోనే కాగా... పదేళ్ల విరామం అనంతరం గతేడాది కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ముచ్చటగా మూడో కప్పు అందించింది కూడా అయ్యరే. పంజాబ్‌కు ట్రోఫీ కట్టబెట్టలేకపోయినా... సారథిగా మాత్రం సూపర్ సక్సెస్ అయ్యాడు. 'బాధ్యత సగం మాత్రమే పూర్తయింది. వచ్చే ఏడాది తప్పక కప్పు గెలుస్తాం' అని ఫైనల్ అనంతరం ధీమా వ్యక్తం చేసిన అయ్యర్... భారత జట్టు భవిష్యత్తు నాయకత్వంపై భరోసా పెంచుతున్నాడు!! 2024 ఐపీఎల్ ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుచేసి... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టు మూడోసారి కప్పు కైవసం చేసుకుంది. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ట్రోఫీ అందుకున్నా... ఆ సమయంలో భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ కేకేఆర్ జట్టు మెంటార్‌గా ఉండటంతో క్రెడిట్ అంతా అతడికే దక్కింది. తదనంతర పరిణామాల్లో గంభీర్ టీమిండియా హెడ్‌కోచ్‌గా ఎదగగా... సమర్థ నాయకుడిని కేకేఆర్ వేలానికి వదిలేసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా జట్టు... ఈసారి లీగ్ దశ దాటలేకపోవడమే గాక... పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంటే... వేలంలో భారీ ధర పెట్టి శ్రేయస్‌ను దక్కించుకున్న పంజాబ్ రెండోసారి రన్నరప్‌గా నిలిచింది. ఈ ఒక్క ఉదాహరణ చాలు శ్రేయస్ సారథ్య సామర్థ్యాన్ని వివరించేందుకు. దేశవాళీ మ్యాచ్‌లు ఆడకుండా నిర్లక్ష్యం వహించినందుకు బీసీసీఐ కాంట్రాక్టు కోల్పోవడం... అపార ప్రతిభ ఉన్నా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక కాకపోవడం ఇవన్నీ పక్కన పెడితే... అతడిలో గొప్ప నాయకుడు ఉన్నాడని తాజా ఐపీఎల్ నిరూపించిందింది.

### ఆటగాడిగా అదుర్స్...

ఈ సీజన్‌లో 17 మ్యాచ్‌లాడిన శ్రేయస్ 50.33 సగటుతో 604 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆరో స్థానంలో నిలిచాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి 175.07 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అతడి గణాంకాలను అంకెల్లో కొలవడం కష్టమే! సీజన్ ఆరంభంలో గుజరాత్‌తో జరిగిన పోరులో సెంచరీకి సమీపించినా... జట్టు ప్రయోజనాలకే పెద్దపీట వేయడంతోనే అయ్యర్ తీరు అందరినీ ఆకట్టుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 19 ఓవర్లు ముగిసేసరికి 220 పరుగులు చేసింది. అయ్యర్ 42 బంతుల్లో 97 పరుగులు చేసి సెంచరీకి సమీపించాడు. చివరి ఓవర్‌లో స్ట్రయికింగ్‌లో ఉన్న శశాంక్ సింగ్ దగ్గరకు వెళ్లి 'నా శతకం గురించి ఆలోచించకు. జట్టు కోసం వీలైనన్ని ఎక్కువ పరుగులు చేయి' అని దిశానిర్దేశం చేశాడు. ఆ ఓవర్ మొత్తం ఆడిన శశాంక్ 23 పరుగులు రాబట్టగా... అయ్యర్ అజేయంగా నిలిచాడు. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడతాడనే గుర్తింపును మరింత పెంచుకుంటూ... ఈసారి మిడిల్ ఓవర్స్‌లో భారీ షాట్లతో విరుచుకుపడి పరుగులు రాబట్టాడు. అందుకే సీజన్ మొత్తంలో 43 ఫోర్లే కొట్టిన అయ్యర్... 39 సిక్స్‌లతో అత్యధిక సిక్స్‌లు కొట్టిన వారి జాబితాలో నికోలస్ పూరన్ (40) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.

### ముంబైపై అసమాన పోరాటం

ఇక క్వాలిఫయర్-2లో ముంబై ఇండియన్స్‌పై శ్రేయస్ ఆడిన ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. బుమ్రా యార్కర్లను ఎదుర్కొనేందుకు మహామహులు ఇబ్బంది పడుతున్న తరుణంలో అతడు దాన్ని షార్ట్ థర్డ్ మ్యాన్ దిశగా తరలించిన తీరు చూసి తీరాల్సిందే. ఆశలే లేని స్థితిలో అద్భుత పోరాటం కనబర్చిన ఈ ముంబైకర్... జట్టును ఒంటిచేత్తో ఫైనల్‌కు చేర్చాడు. 'అయ్యర్ అవుట్ అయినప్పుడే... పంజాబ్ పరాజయం ఖాయమైంది' బెంగళూరుతో ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా ప్రతి ఒక్కరి నోట వినిపించిన మాట ఇదే. అంతలా అభిమానుల నమ్మకాన్ని సంపాదించుకున్న శ్రేయస్... చేతి వరకు వచ్చిన కప్పు చేజారుతున్నా కాస్త కూడా చలించలేదు. చిరకాల కల నెరవేరడంతో ప్రపంచ మేటి ఆటగాడు విరాట్ కోహ్లి చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తుంటే... సుదీర్ఘ కాలం ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించినా.. జట్టును విజేతగా నిలపలేకపోయిన ఏబీ డివిలియన్స్, క్రిస్ గేల్ వంటి దిగ్గజ ప్లేయర్లు సంబరాల్లో భాగమైపోయారు. ఇక ఆర్‌సీబీ అభిమానుల ఆనందానికైతే అవధులే లేవు!


# ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు..

# విండీస్ బ్యాటర్ల బీభత్సం



మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఇవాళ (జూన్ 8) జరుగుతున్న రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు బీభత్సం సృష్టించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ ఆదిలో నిదానంగా ఆడినా, ఇన్నింగ్స్ చివర్లో చెలరేగింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు రోవ్‌మన్ పావెల్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), రొమారియో షెపర్డ్ (11 బంతుల్లో 19; 2 సిక్సర్లు), జేసన్ హోల్డర్ (9 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), రోస్టన్ ఛేజ్ (1 బంతిలో 6 పరుగులు (నాటౌట్) ఆకాశమే హద్దుగా బ్యాటింగ్ చేశారు. ఫలితంగా ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. 16 ఓవర్లలో తర్వాత 121/4గా ఉండిన విండీస్ స్కోర్.. చివరి 4 ఓవర్లలో రాకెట్ లాగా దూసుకోపోయింది. పావెల్, షెపర్డ్, హోల్డర్, ఛేజ్ విజృంభించడంతో 4 ఓవర్లలో ఏకంగా 75 పరుగులు వచ్చాయి. ఆదిల్ రషీద్ వేసిన 19 ఓవర్లో హోల్డర్, షెపర్డ్ ఊచకోత కోశారు. ఈ ఓవర్‌లో ఇరువురు కలిసి 5 సిక్సర్లు బాదారు. ఫలితంగా ఆ ఓవర్‌లో 31 పరుగులు వచ్చాయి. అంతకుముందు 17 ఓవర్లో 20, 18వ ఓవర్‌లో 8, ఆఖరి ఓవర్‌లో 16 పరుగులు వచ్చాయి. కాగా, ఈ సిరీస్‌లో జరిగిన తొలి టీ20లో ఇంగ్లండ్ 21 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (96) తృటిలో సెంచరీ మిస్ అయ్యాడు. జేమీ స్మిత్ (38), జేకబ్ బేతెల్ (23 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేశారు. విండీస్ బౌలర్లలో షెపర్డ్ వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన విండీస్.. లియామ్ డాసన్ (40204) చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 167 పరుగులే చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో పాట్స్, జేకబ్ బేతెల్ తలో 2 వికెట్లు తీశారు. విండీస్ ఇన్నింగ్స్‌లో ఎవిన్ లెవిస్ (39) టాప్ స్కోరర్ కాగా.. ఛేజ్ 24, జాన్సన్ ఛార్లెస్ 18, రోవ్‌మన్ పావెల్ 13, ఆండ్రీ రసెల్ 15, షెపర్డ్ 16, హోల్డర్ 16 (నాటౌట్) పరుగులు చేశారు.

# టీమిండియాకు స్వల్ప ఆధిక్యం



ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న రెండో నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత ఏ జట్టుకు 21 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌కు 327 పరుగుల వద్ద తెరపడింది. ఖలీల్ అహ్మద్ (191704), అన్షుల్ కంబోజ్ (183562), తుషార్ దేశ్‌పాండే (141622), తనుశ్ కోటియన్ (112251), నితీశ్ కుమార్ రెడ్డి (122491) చెలరేగడంతో లయన్స్ భారత తొలి ఇన్నింగ్స్ స్కోర్‌ను దాటలేకపోయింది. 192/3 స్కోర్ వద్ద మూడో రోజు ఆట ప్రారంభించిన లయన్స్ టీ విరామం లోపే మిగతా 7 వికెట్లు కోల్పోయింది. ఇవాళ ఆటలో ఖలీల్ అహ్మద్ నిప్పులు చెరిగాడు. ఇవాళ లయన్స్ కోల్పోయిన 7 వికెట్లలో ఖలీల్ ఒక్కడే 4 వికెట్లు తీశాడు. లయన్స్ చివరి ముగ్గురు ఆటగాళ్లు ఫర్హాన్ అహ్మద్ (24), జోష్ టంగ్ (36 నాటౌట్), ఎడ్వర్డ్ జాక్ (16) ప్రతిఘటించడంతో లయన్స్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. లయన్స్ ఇన్నింగ్స్‌లో టామ్ హెయిన్స్ 54, ఎమిలియో గే 71 అర్ధ సెంచరీలతో రాణించగా.. జోర్డర్ కాక్స్ 45, బెన్ మెక్‌కిన్నీ 12, జేమ్స్ ర్యూ 10, జార్జ్ హిల్ 0, క్రిస్ వోక్స్ 5, మ్యాక్స్ హోల్డన్ 7 పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో 348 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (116) అద్భుతమైన శతకంతో భారత్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ధృవ్ జురెల్ (52), కరుణ్ నాయర్ (40), నితీశ్ కుమార్ రెడ్డి (34) రాణించారు. యశస్వి జైస్వాల్ (17), అభిమన్యు ఈశ్వరన్ (11), శార్దూల్ ఠాకూర్ (19), తనుశ్ కోటియన్ (15), అన్షుల్ కంబోజ్ (2), తుషార్ దేశ్‌పాండే (11) తక్కువ స్కోర్‌కు ఔటయ్యారు.



మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 09-06-2025

# స్వేచ్ఛగా బతకడమే సక్సెస్

**దక్షిణాదిలో తిరుగులేని నటి అనిపించుకున్న హీరోయిన్ సమంతా రుతుప్రభు. పదిహేనేండ్లుగా ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించి అభిమానులను అలరిస్తున్నది. ఇటీవల విడుదలైన 'శుభం' సినిమాతో నిర్మాతగా కొత్త ప్రయాణం ప్రారంభించిందామె. వ్యక్తిగత కారణాల వల్ల యాక్టింగ్ నుంచి కొంతకాలం బ్రేక్ తీసుకున్నానని త్వరలోనే 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తానంటున్నది సామ్. జీవితంలో ఎదురైన ప్రతి సమస్యను సవాలుగా స్వీకరించానంటూ సమంత పంచుకున్న కబుర్లు..**

ఏ విషయంలో అయినా నా మనసుకు నచ్చిందే చేశాను. ఓ అభిమాని నా కోసం గుడి కట్టారని తెలిసి ఆశ్చర్యపోయా. నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్నారా? అనుకున్నా. అతను తన ప్రేమను చూపించే తీరు మంచిదే అనిపించినా.. గుళ్లు కట్టి పూజలు చేసే పద్ధతిని మాత్రం ఎంకరేజ్ చేయను. ఆరోగ్యపరమైన సమస్యల రీత్యా కొంతకాలం వర్క్ నుంచి బ్రేక్ తీసుకున్నా. యాక్టింగ్‌ను ఎంతో మిస్ అయ్యా. నటన మర్చిపోయానేమో అనిపించింది. 'రక్త్ బ్రహ్మాండ్: ద బ్లడీ కింగ్‌డమ్' షూట్‌లోకి అడుగుపెట్టిన తొలిరోజు అంత సులువుగా అనిపించలేదు. ఒకసారి యాక్టింగ్‌లోకి దిగితే జీవితాంతం అది మనలో భాగం అవుతుందని అప్పుడు అర్థమైంది. జీవితంలో కొన్ని మంచిరోజులు, కొన్ని చెడ్డరోజులు ఉంటాయి. ఒకానొక స్టేజిలో లైఫ్‌లో ముందుకెళ్లలేనేమో అనిపించింది. వెనక్కి తిరిగి చూస్తే ఇంతదాకా వచ్చానా అనిపిస్తుంది. నటిగా నిలదొక్కుకోవడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరాటపడేదాన్ని. ఈ క్రమంలో తొలినాళ్లలో కొన్ని నచ్చని కథలని కూడా ఎంచుకున్నా. ప్రస్తుతం కథల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నా. విజయం కన్నా ఓటమి వల్లే ఎక్కువ విషయాలు నేర్చుకోవచ్చు. నా సినిమా తొలిసారి ఫ్లాప్ అయినప్పుడు కుమిలిపోయా. నేనొక ఫెయిల్యూర్‌ని అనుకున్నా. ఇన్నాళ్ల అనుభవంతో సక్సెస్ అంటే నా దృష్టిలో నిర్వచనం మారింది. స్వేచ్ఛగా జీవించడమే విజయం అని అర్థమైంది. ప్రస్తుతం నేను సక్సెస్‌లో లేనని చాలామంది అనుకుంటారు. కానీ, గతంతో పోలిస్తే ఇప్పుడే విజయవంతంగా రాణిస్తున్నా. 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'తో నిర్మాతగా కొత్త ప్రయాణం ప్రారంభించా. కొత్త కథలు చెప్పాలి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది 'ట్రాలాలా' ముఖ్య ఉద్దేశం. నటిగా స్టార్‌డమ్ వచ్చినా.. చిత్ర పరిశ్రమ కోసం ఏదో చేయాలనే ఆలోచన ఎప్పుడూ ఉండేది. అందుకే కాస్త విరామం తీసుకుని నిర్మాతగా మారాలని ఫిక్స్ అయ్యా. కెరీర్ ఆరంభంలోనే చాలా సక్సెస్‌లు చూశా. నేను నటించిన సినిమాలు వరుస విజయాలు అందుకున్నాయి. దాంతో అందరూ నన్ను 'గోల్డెన్ లెగ్ ఆఫ్ తెలుగు సినిమా' అని పిలిచేవారు. పోటీలో భాగమైపోయా. అభిమానుల వల్లే ఈ స్థాయికి వచ్చాను. అందుకే వాళ్లు ఎప్పుడైనా ఫొటోల కోసం అడిగితే నో చెప్పను. నాకిష్టమైన పనులతో కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నా.





# అక్కినేని ఇంట పెళ్లి సందడి

## అఖిల్‌జైనాబ్ పెళ్లి రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

### వధూవరులను ఆశీర్వదించిన మహేశ్ బాబు, సూర్య

### పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖుల రాక

**హైదరాబాద్, మహా**

అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి కొనసాగుతోంది. యువ కథానాయకుడు అక్కినేని అఖిల్, జైనాబ్‌ల వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరై అఖిల్, జైనాబ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబు తన సతీమణి నమ్రతతో కలిసి విచ్చేయగా, తమిళ స్టార్ హీరో సూర్య, యువ దర్శకుడు వెంకీ అట్లూరి తదితరులు కూడా ఈ వేడుకలో పాలుపంచుకుని నవ దంపతులకు తమ ఆశీస్సులు అందించారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌ఉపాసన, నాని, నిఖిల్, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు సానా తదితరులు కూడా విచ్చేశారు. వీరితో పాటు మరికొంతమంది సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు ఈ వివాహ విందులో పాల్గొని సందడి చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రాంగణం ప్రముఖుల రాకతో కళకళలాడింది. అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా అఖిల్, జైనబ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ వేడుకకు సంబంధించిన కొన్ని ఆకర్షణీయమైన ఫోటోలను అన్నపూర్ణ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకోగా, అవి ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన, శుక్రవారం నాడు, అఖిల్, జైనాబ్‌ల వివాహం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నాగార్జున నివాసంలో నిరాడంబరంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహానంతరం ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, క్రీడా రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# వాటిని ఒప్పుకోకపోతే కెరీర్‌లో ఎదగలేం.. పూజా హెగ్డే

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్.. ఇలా మూడు ఇండస్ట్రీల్లో తనదైన ముద్ర వేసుకుంటూ కొన్నాళ్లు టాప్ హీరోయిన్ స్టేటస్ అనుభవించింది పూజా హెగ్డే ( Pooja Hegde ). మోడలింగ్ రంగంలో అడుగుపెట్టిన ఆమె 2010లో 'మిస్ యూనివర్స్ ఇండియా' పోటీలో రెండో రన్నరప్‌గా నిలిచింది. తర్వాత 2012లో తమిళ చిత్రం 'ముగమూడి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుందా', 'దువ్వాడ జగన్నాథం', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి హిట్ చిత్రాల్లో నటించి తన గ్లామర్, నటనతో గుర్తింపు పొందింది. బాలీవుడ్‌లోనూ 'మొహెంజోదారో', 'హౌస్‌ఫుల్ 4', 'సర్కస్' వంటి సినిమాలతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అయితే కొన్నాళ్లుగా వరుస ఫ్లాపుల్లో ఉన్న ఈ బ్యూటీని మేకర్స్ పట్టించుకోకపోవడంతో ప్రేక్షకులకు దూరమైంది. ఇటీవలే సూర్యతో 'రెట్రో' మూవీ నటించి మెప్పించింది. విజయ్ సరసన 'జన నాయగన్'తో మరోసారి ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోన్న ఈ బ్యూటీ తన కెరీర్, వ్యక్తిగత విషయాలను ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. విజయ్ అద్భుతమైన నటుడు. ఆయనతో కలిసి గతంలో 'బీస్ట్'లో నటించా. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచినా మ్యూజిక్ పరంగా పెద్ద హిట్ అయింది. ఇప్పుడు ఆయనతో మరోసారి 'జన నాయగన్'లో నటిస్తున్నా. అయితే ఇదే ఆయన చివరి చిత్రం కావడం ఆయన అభిమానిగా నాకు చాలా బాధగా ఉంది. ఇటీవల కాలంలో నేను నటించిన కొన్ని చిత్రాలు ఫ్లాఫ్ అయ్యాయి. కొన్నాళ్లుగా నా కెరీర్లో విజయం అన్న పదమే లేకుండా పోయింది. ఇప్పుడు రాబోయే చిత్రాలు, భవిష్యత్ ప్రాజెక్టులతో నేనేంటో మరోసారి నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నా. సినీ రంగంలో నేను ఒక స్థాయికి వచ్చినా సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందనే అనుకుంటా' 'నటిగా నన్ను నేను నిరూపించుకోవడం, అద్భుతమైన వ్యక్తులతో కలిసి నటించడం, క్రిటిక్స్ ప్రశంసలు అందుకోవడం.. ఇదే నా టార్గెట్. నా సినీ ప్రయాణంలో ఎన్నో బ్లాక్‌బస్టర్లు, ఫ్లాపులు ఉన్నాయి. వాటన్నింటినీ మనసులో పెట్టుకుంటే ముందుకి వెళ్లలేం. విజయం సాధించినప్పుడు ఉప్పొంగిపోతే ముందుకి వెళ్లలేం..' అని చెప్పుకొచ్చింది ఈ బుట్టబొమ్మ.

# వీధిలోకొచ్చారు... థియేటర్‌కి వెళ్లారు... గోడ దూకారు!

**ఒక హీరో తన సినిమా ప్రమోషన్ కోసం జనాల్లోకి వచ్చారు... ఇంకో హీరో విడుదలైన తన సినిమా ఎలా ఉందో తెలుసుకోవడానికి థియేటర్‌కి వెళ్లారు... మరో నటుడు షూటింగ్‌కి లేట్ అవుతుందని గోడ దూకేశారు... వీరు ఏం చేసినా సినిమా కోసమే. బాలీవుడ్ నటులు ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, అనుపమ్ ఖేర్ తాజాగా ఇలా హాట్ టాపిక్ అయ్యారు. ఇక ఆ విశేషాలు తెలుసుకుందాం.**



**వడపావ్ చేస్తూ...**

సినిమా ప్రమోషన్ కోసం ఏ అవతారం ఎత్తడానికైనా రెడీ అయిపోతారు ఆమిర్ ఖాన్. అందుకు ఓ ఉదాహరణ '3 ఇడియట్స్' (2009) సినిమా. ఈ చిత్రం విడుదల సమయంలో పంజాబ్‌లో జరిగిన పెళ్లి వేడుకలకు ఫారినర్‌లా డ్రెస్ చేసుకుని హాజరయ్యారు ఆమిర్. ఆ తర్వాత అసలు గెటప్‌లోకి మారి, అందర్నీ ఆశ్చర్యపరిచారు. తాజాగా తాను హీరోగా నటిం చిన 'సితారే జమీన్ పర్' ప్రచారం కోసం జనాల్లోకి వచ్చి, 'వడపావ్' తయారు చేశారు ఆమిర్. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. ఆమిర్ ఖాన్ దర్శకత్వం వహించి, నటించిన 'తారే జమీన్ పర్' (2007)కి సీక్వెల్‌గా 'సితారే జమీన్ పర్' రూపొందింది. ఆర్ఎస్. ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ స్పోర్ట్స్ డ్రామా మూవీకి ఆమిర్ ఖాన్ ఓ నిర్మాత.

**రివ్యూ కోసం మాస్క్‌తో!**

మామూలుగా సినిమా రిలీజ్ అయ్యాక ఎలా ఉందో తెలుసుకోవడానికి నిర్మాతలు, పంపిణీదారులు, సన్నిహితులను అడుగు తుంటారు స్టార్స్. అయితే 'హౌస్‌ఫుల్ 5' సినిమా ఎలా ఉందో స్వయంగా ప్రేక్షకులను అడిగి తెలుసుకోవాలనుకున్నారు ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్ చేసిన అక్షయ్ కుమార్. ముఖానికి మాస్క్ తొడుక్కుని ముంబైలోని ఓ థియేటర్‌కి వెళ్లి, మైక్ పట్టుకుని 'సినిమా ఎలా ఉంది' అని థియేటర్ నుంచి బయటికొస్తున్న ప్రేక్షకులను అడిగారు. ఆ వీడియో వైరల్‌గా మారింది. 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందిన 'హౌస్‌ఫుల్ 5'లో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. తరుణ్ మన్సుఖానీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలైంది.

**ఏడు పదుల వయసులో గోడ దూకి...**

షూటింగ్‌కి ఆలస్యం అవుతోంది... డ్రైవర్‌ని కారు వేగం పెంచమన్నారు అనుపమ్ ఖేర్. కట్ చేస్తే... షూటింగ్ లొకేషన్‌కి చేరుకోలేదు. ఎందుకంటే కారు డెడ్ ఎండ్‌కి చేరుకుంది. రివర్స్ చేసుకుని, వెనక్కి వెళదామంటే వీలు పడలేదట. ఓ గోడ దూకితే అటు పక్క లొకేషన్ ఉంది. సాహసం చేసేద్దాం అని అనుపమ్, ఆయన టీమ్ నిర్ణయించుకున్నారు. నిచ్చెన తెచ్చారు. అనుపమ్ ఖేర్ ఆ నిచ్చెన ఎక్కి, గోడ దూకి లొకేషన్లోకి అడుగుపెట్టారు. ఇంతకీ ఈయన వయసు ఎంతో తెలుసా? 70. ఏడు పదుల వయసులో అనుపమ్ ఖేర్ ఇలా జోష్‌గా, జోరుగా గోడ దూకడం హాట్ టాపిక్ అయింది. ఆయన ఏ షూటింగ్‌లో పాల్గొనడానికి హైదరాబాద్ చేరుకున్నారంటే ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) కోసం. ఈ చిత్రంలో ఈ బాలీవుడ్ నటుడు కీలకపాత్ర చేస్తున్నారు. ఇక తాను ఇలా గోడ దూకిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వివరించి, ఆ వీడియోను షేర్ చేశారు అనుపమ్ ఖేర్. ''నా 40 ఏళ్ల సినిమా ప్రయాణంలో పలు రకాలుగా షూటింగ్ లొకేషన్స్‌కి వెళ్లాను. కానీ, ఇలా వెళ్లడం చాలా ప్రత్యేకంగా, కామెడీగా అనిపించింది'' అని రాసుకొచ్చారీ సీనియర్ నటుడు.

# చెప్పిన డేట్‌కి రిలీజ్ చేయ్.. లేదంటే రూ.10 కోట్లు కట్

ప్రస్తుతం టాలీవుడ్‌లో ఓటీటీల ఆధిపత్యం నడుస్తోంది. ఏ సినిమా ఎప్పుడు రిలీజ్ అవ్వాలనేది సదరు సంస్థలే డిసైడ్ చేస్తున్నాయి. ఇప్పటివరకు దీని గురించి నిర్మాతలు పెద్దగా ఓపెన్ అయింది లేదు. కానీ త్వరలో రిలీజ్ కాబోతున్న 'కుబేర' నిర్మాత సునీల్ నారంగ్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇండస్ట్రీని ఇబ్బంది పెడుతున్న సమస్యల గురించి తన అభిప్రాయాల్ని చెప్పుకొచ్చారు. ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకుడు. జూన్ 20న థియేటర్లలోకి రాబోతుంది. ఇప్పటికే రిలీజైన పాటలు, టీజర్ కాస్త హైప్ తీసుకొచ్చాయి. త్వరలో ట్రైలర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలోనే చిత్ర నిర్మాతలైన సునీల్ నారంగ్ మాట్లాడుతూ.. ఓటీటీల ఆధిపత్యం గురించి చెప్పుకొచ్చారు. 'మేం 'కుబేర' చిత్రానికి జూలైలో రిలీజ్ చేస్తామని అడిగాం. కానీ ప్రైమ్ వాడు మాత్రం జూన్ 20న విడుదల చేయండి లేదంటే ఓటీటీ డీల్ నుంచి రూ.10 కోట్లు కట్ చేస్తామని అన్నాడు' అని చెప్పుకొచ్చారు.



ప్రస్తుతం ఇండస్ట్రీలో క్యూబ్ సిస్టమ్, బుక్ మై షో, ఓటీటీల ఆధిపత్యం నడుస్తోందని సునీల్ నారంగ్ చెప్పుకొచ్చారు. అలానే 140 కోట్ల మంది జనాభాలో 4050 మంది హీరోలు మాత్రమే ఉన్నారని.. దీంతో వాళ్లు దేవుళ్లతో సమానం అని చెప్పుకొచ్చారు. ఇకపోతే తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్‌గా ఈయన శనివారం సాయంత్రం ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రానికల్లా రాజీనామా చేశారు. తనకు సమాచారం ఇవ్వకుండా ఎవరికి వారు ప్రకటనలు జారీ చేస్తున్నారని, కొందరి వ్యాఖ్యలు తనని బాధించాయని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో ప్రెసిడెంట్‌గా కొనసాగడం కష్టంగా ఉందని చెబుతూ ఓ లేఖని రిలీజ్ చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com